RNI No. APTEL/2012/53127
TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక
The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 | సంచిక : 32 | శుక్రవారం 8.5. 2026 | ఎడిటర్ : జేరిపోతుల సంపత్ | పేజీలు :8 | వెల: 2.00

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292



## ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి దుర్మార్గమైన చర్య: కేటీఆర్

**హైదరాబాద్ (తెలంగాణ వాణి)**

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో పాటు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంపు కార్యాలయంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ అనుచరుల దాడి హేయమైనదని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (ఖు=) ఖండించారు. దాడి జరిగిన వెంటనే కౌశిక్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడినట్లు 'ఎక్స్'లో పేర్కొన్నారు. పట్టపగలు గూండాల మాదిరిగా క్యాంపు కార్యాలయంలోకి ప్రవేశించి వాహనాలు, ఆఫీసు ధ్వంసం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. కళ్ల ముందే ఇంత అరాచకం సృష్టిస్తున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తూ చోద్యం చూడటం సిగ్గుచేటని ఆక్షేపించారు. సీఎం రేవంత్‌రెడ్డికి బీ టీమ్‌గా మారిన బండి సంజయ్.. బీఆర్ఎస్ నేతలు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే ఇలాంటి చర్యలకు ఉసిగొల్పుతున్నారని కేటీఆర్ విమర్శించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉండి తన అనుచరులతో శాంతి భద్రతలను దెబ్బతీసేలా వ్యవహరించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని మండిపడ్డారు. భాజపా శ్రేణుల దాడిని మాజీ మంత్రి హరీశ్‌రావు ఖండించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధుల క్యాంపు కార్యాలయాలపైనే ముప్పేట దాడులు జరుగుతుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలు ఉన్నట్లా? లేనట్లా? అని ప్రశ్నించారు. ఏకంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం లోనే ఇలాంటి పరిస్థితులు నెలకొనడం అత్యంత దురదృష్టకరమని ఆక్షేపించారు. దాడులకు పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకుని, రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి దాడులు ఆపకపోతే.. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలే వీధుల్లోకి రావాల్సిన పరిస్థితి వస్తుందని హరీశ్ రావు హెచ్చరించారు.

# కరీంనగర్‌లో ఉద్రిక్తత..

## ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారు ధ్వంసం

**కరీంనగర్(తెలంగాణ వాణి)**

కరీంనగర్‌లో రాజకీయ యుద్ధం మొదలైంది. కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను ఉద్దేశించి పాడి కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ శ్రేణులు ఆగ్రహంతో వీధుల్లోకి వచ్చాయి. పెద్ద ఎత్తున తరలివచ్చిన బీజేపీ కార్యకర్తలు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అధికారిక క్యాంప్ ఆఫీస్ ముట్టడికి ప్రయత్నించారు. ఈ క్రమంలో అక్కడే ప్రెస్ మీట్ నిర్వహించడానికి వచ్చిన బీఆర్ఎస్ నేత పాడి కౌశిక్ రెడ్డి కారుపై బీజేపీ కార్యకర్తలు రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో కౌశిక్ రెడ్డి కారు అద్దాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ప్రభుత్వ క్యాంపు ఆఫీసు ఫర్నిచర్ ధ్వంసం చేశారుబండి సంజయ్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేశారు.





గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్ వద్దకు భారీగా చేరుకున్న కార్యకర్తలను అడ్డుకోవడానికి పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు. పరిస్థితి అదుపు తప్పుతుం డటంతో పోలీసులు బీజేపీ శ్రేణులపై లాఠీచార్జ్ చేసి వారిని చెదరగొట్టారు. ఈ తోపులాటలో పలువురు కార్యకర్తలకు స్వల్ప గాయాలైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గంగుల కమలాకర్ క్యాంప్ ఆఫీస్ వద్ద భారీగా పోలీస్ బలగాలను మోహరించారు. కరీంనగర్ పట్టణంలో అదనపు సిబ్బందితో నిఘా పెంచారు. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలు, దానికి నిరసనగా బీజేపీ శ్రేణులు చేసిన దాడితో జిల్లాలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. గంగుల ఆఫీసులో ప్రెస్ మీట్ పెట్టేందుకు పాడి కౌశిక్ రెడ్డి రాగా.. బీజేపీ శ్రేణులు ఆ కార్యాలయంపై దాడి చేశారు. లోపల కౌశిక్ రెడ్డి మీడియా సమావేశం కొనసాగుతుండగానే.. బీజేపీ కార్యకర్తలు కార్యాలయంపై దాడిచేశారు. బీఆర్ఎస్, బీజేపీ శ్రేణుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.కరీంనగర్లో హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నిర్వహించిన ప్రెస్ మీట్ లో కేంద్రమంత్రి బండి సంజయ్ పై తీవ్ర విమర్శలు గుప్పించారు. తంబాకులో డ్రగ్స్ కలిపి తినడం వల్లే బండి సంజయ్ కు బట్టతల వచ్చిందని దుయ్యబట్టారు. నోటికొచ్చినట్లు మాట్లాడటం తమకు కూడా చేతనవుతుందని, బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని సూచించారు. గతంలో ఆయన తన భార్య పుస్తెల్ని అమ్మి ఎన్నికల్లో పోటీ చేసినట్లు చెప్పారన్నారు. ఎన్నికల్లో బండిసంజయ్ పంచినద అవినీతి డబ్బా లేక రేవంత్ పంపిన డబ్బా అని ప్రశ్నించారు. కేటీఆర్ పై నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని, ఏ అంశం మీదనైనా తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని కౌశిక్ రెడ్డి తెలిపారు. డ్రగ్స్ టెస్టుకు కేటీఆర్ ను తాను తీసుకొస్తానని, ఇందుకు బండి సంజయ్ కూడా సిద్ధం కావాలని సవాల్ చేశారు. బండి సంజయ్ కు డ్రగ్స్ అలవాటు ఉందని కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ శ్రేణులు తీవ్ర ఆగ్రహంతో దాడులకు పాల్పడ్డారు.

## ట్రాఫిక్ ఆపకుండానే.. సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్ ప్రయాణం



**హైదరాబాద్ (తెలంగాణ వాణి)**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మాటను నిలబెట్టుకుంటూ సామాన్య ప్రజల ఇబ్బందులను తొలగించే దిశగా కీలక అడుగు వేశారు. సాధారణంగా వీవీఐపీల కాన్వాయ్ వెళ్తుందంటే కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌ను నిలిపివేయడం ఆనవాయితీ. కానీ, అందుకు భిన్నంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి జూబ్లీహిల్స్‌లోని తన నివాసం వరకు సాధారణ ట్రాఫిక్‌లోనే పయనించి అందరినీ ఆశ్చర్యపరిచారు. వివరాల్లోకి వెళితే.. నిన్న (బుధవారం) ఢిల్లీ పర్యటనకు వెళ్లే సమయంలో ట్రాఫిక్ ఆంక్షల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించిన సీఎం, వెంటనే పోలీసు ఉన్నతాధికారులపై అసహనం వ్యక్తం చేశారు. తన కాన్వాయ్ కోసం గంటల తరబడి వాహనాలను నిలిపివేయడం సరైన పద్ధతి కాదని, ప్రజల సమయాన్ని వృథా చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు డీజీపీకి, ట్రాఫిక్ విభాగం అధికారులకు కింది ఆదేశాలు జారీ చేశారు. సీఎం కాన్వాయ్ కోసం రోడ్లపై వాహనాలను పూర్తిగా నిలిపివేయకూడదు. ప్రజలకు, ముఖ్యంగా విమానాశ్రయానికి వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఆటంకం కలగకూడదు. సింగిల్ లైన్ విధానాన్ని అమలు చేస్తూ, ఇతర వాహనాలను అనుమతించాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో అప్రమత్తమైన ట్రాఫిక్ పోలీసులు, ఈరోజు ఆయన ఎయిర్‌పోర్ట్ నుంచి తిరిగి వచ్చే సమయంలో ఎక్కడా ట్రాఫిక్‌ను స్తంభింపజేయలేదు. కాన్వాయ్ వెళ్లే మార్గంలో కేవలం ఒక లైన్‌ను మాత్రమే కేటాయించి, మిగిలిన లైన్లలో సాధారణ వాహనాల రాకపోకలను కొనసాగించారు. "ప్రజా ప్రభుత్వం" అని చెప్పుకునే తన పాలనలో సామాన్యులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో సీఎం తీసుకున్న ఈ నిర్ణయంపై నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి స్వయంగా ట్రాఫిక్‌లో ప్రయాణించడం సోషల్ మీడియాలో కూడా హాట్ టాపిక్‌గా మారింది.

## నేను ఏసీ గదిలో కూర్చుని మాట్లాడటం లేదు'..

### మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు



**చౌటుప్పల్ (తెలంగాణ వాణి)**

: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు గురువారం సందర్శించారు. నెల రోజులుగా వడ్లు కొనుగోలు చేయడం లేదని, తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని పలువురు రైతులు ఆయన ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్‌లో తడిసిన వడ్ల కుప్పలను పరిశీలించిన హరీశ్ రావు రైతులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. "వడ్ల కుప్పల వద్దనే రైతుల గుండెలు ఆగిపోతున్నా సీఎం రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదు" అని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ కనిపించలేదన్నారు. జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోళు సజావుగా జరుగుతున్నాయని చెప్పడం వాస్తవాలకు విరుద్ధమని హరీశ్ రావు ఆరోపించారు. "నేను ఏసీ గదిలో కూర్చొని మాట్లాడటం లేదు. రైతుల మధ్య నిలబడి వారి బాధలు వింటున్నా" అని అన్నారు.రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ, మాయిశ్చర్ పరీక్షకు పది రోజులు, గన్నీ బ్యాగులకు మరో వారం, కాంటా పెట్టడానికి ఇంకో వారం పడుతోందని తెలిపారు. మిల్లులకు వెళ్లిన తర్వాత కూడా లారీకి 4 నుంచి 5 బస్తాల వరకు కటింగ్ పెడుతున్నారని ఆరోపించారు అకాల వర్షాల నేపథ్యంలో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పేర్కొన్న ఆయన, చౌటుప్పల్ మార్కెట్‌లో వర్షం పడితే వడ్ల కుప్పలు నీట మునిగే ప్రమాదం ఉందన్నారు.

## ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు.. నవశకానికి తెలంగాణ శ్రీకారం

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్ (తెలంగాణ వాణి)**

ప్రతి పేదవాడికి సొంత ఇల్లును సమకూర్చడం, భూ యాజమానులకు తమ భూమిపై స్పష్టమైన హక్కులను కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ఇల్లు, భూమి ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీకని పేదవాడికి భద్రమైన భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద పేద కుటుంబాలకు వారి సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. సుమారు 4 లక్షల ఇళ్లను మంజూరు చేసి గృహ విప్లవానికి శ్రీకారం చుట్టామన్నారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై గురువారం హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారాలతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో క్షేత్ర స్థాయిలోని పరిస్థితులపై స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంతో వ్యవహరించాలని, జిల్లా స్థాయిలో అధికార యంత్రాగమంతా సమన్వయంతో పని చేస్తే అక్కడికక్కడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో అత్యధిక శాతం అధికారాలను కలెక్టర్లకే ఇచ్చామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల




ప్రొసీడింగ్స్ ఇచ్చి, మొదటి బిల్లు వారి ఖాతాల్లో జమ అయిన లబ్ధిదారులందరికీ తదుపరి విడతల బిల్లులన్నిటిని సకాలంలోనే విడుదలయ్యేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో ఎటువంటి అక్రమాలకు తావివ్వకుండా, పూర్తి పారదర్శకంగా జవాబుదారీ తనంతో పనిచేస్తూ అర్హులైన వారికే ఫలాలు దక్కేలా చూడాలని ఈ విషయంలో ఎక్కడ పొరపాటు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. ఇల్లు మంజురైనా వివిధ కారాణలతో నిర్మాణాలను పూర్తి చేయని వారికి కూడా వెసులుబాటు కల్పించే యోచనలో ఉన్నామన్నారు. అలాగే డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణపు పనులు ఏ స్థాయిలో ఉన్నా, 20 వ తేదీలోగా లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయాలని ఆదేశించారు.అన్ని ప్రాంతాల్లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో, అవసరానికి అనుగుణంగా, అదనంగా మరో తహశీల్దార్ ను నియమించనున్నామన్నారు. ఇందుకు సంబంధించిన జిల్లా కలెక్టర్లు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, అటవీ తదితర శాఖల మధ్య ఉన్న భూ వివాదాల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఉమ్మడిగా సర్వే చేయడమే మార్గమన్నారు. ఈ దిశలో మరింత వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అటవీ, రెవెన్యూ అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా రెవెన్యూ విభాగంలో అనేక సంస్కరణలు తీసుకుని వచ్చి ఆర్డీవోలకు విస్తృతమైన అధికారాలు కల్పించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాకుండా, ఇతర ప్రయోజనాలకు వీటిని వినియోగిస్తే అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ పరిపాలనను బలోపేతం చేయడంలో భాగంగా సర్వే, సెటిల్మెంట్స్ మరియు భూ రికార్డుల శాఖ ద్వారా సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి అన్నారు. భూ రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సమావేశాల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నల్గొండ ఇన్ ఛార్జి మంత్రి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకాటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, ప్రభుత్వ సలహాదారులు జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# తమిళనాట అదే సందిగ్ధత.. మళ్లీ విజయ్‌కు తిరస్కరణ..

**ఢిల్లీ (తెలంగాణ వాణి)**

తమిళనాడులో రాజకీయ పరిణామాలు క్షణక్షణానికి మారుతున్నాయి. టీవీకే చీఫ్ విజయ్ గురువారం మరోసారి లోక్‌భవన్‌కు వెళ్లి, గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను కలిశారు. తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి, అసెంబ్లీలో మెజార్టీ నిరూపించుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ భేటీపై లోక్‌భవన్ తాజాగా ప్రెస్‌నోట్ విడుదల చేసింది. "ఇవాళ గవర్నర్ ఆర్లేకర్‌తో విజయ్ భేటీ అయ్యారు. మెజార్టీ కనిపించడం లేదని వివరించారు. మెజార్టీతోనే రావాలని గవర్నర్ సూచించారు" అని లోక్‌భవన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడింది. అయితే, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మరే ఇతర పార్టీని ఆహ్వానించబోమని విజయ్‌కు గవర్నర్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. గవర్నర్ ఆహ్వానం మేరకే విజయ్‌ఆయన్ను కలిసినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత రెండు రోజుల వ్యవధిలో రెండుసార్లు వీరి భేటీ జరిగింది. కాంగ్రెస్ మద్దతు ఇచ్చిన నేపథ్యంలో నిన్న గవర్నర్‌తో టీవీకే చీఫ్ భేటీ కాగా.. సంఖ్యాబలంపై గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేయలేదు. 118 మంది సభ్యులు (మెజార్టీ మార్క్) సమకూరిన అనంతరం రావాలని సూచించినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. విజయ్‌కు అనుమతి ఇవ్వాలి.. ప్రభుత్వం ఏర్పాటుచేయడానికి విజయ్‌కు అనుమతి ఇవ్వాలని వీసీకే గవర్నర్‌ను కోరింది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించే అవకాశంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఇద్దరేసి ఎమ్మెల్యేలున్న వీసీకే, సీపీఐ సానుకూలంగా స్పందించినా, ఇంకా అధికారికంగా చెప్పలేదు. టీవీకేకు తొలుత అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాన్ని డీఎంకే కూడా వ్యక్తంచేసింది. ప్రొటోకాల్ ప్రకారం తమిళనాడు ముఖ్యమంత్రికి అందించే పోలీసు కాన్వాయ్‌ను విజయ్ నిరాకరించారు. ప్రమాణస్వీకారానికి ముందే ఆ ఏర్పాటు తనకు వద్దని విజయ్ చెప్పినట్లు టీవీకే వెల్లడించింది. తమిళనాడులో టీవీకే నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధం నెలకొనడంతో ఆయన కాన్వాయ్‌ను వెనక్కి తీసుకున్నారంటూ వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. గురువారం పార్టీ నుంచి వచ్చిన స్పందనను పోలీసు అధికారులు కూడా ధ్రువీకరించారు.
తమిళనాడు ఎన్నికల ఫలితాల అనంతరం ప్రొటోకాల్ ప్రకారం అందించిన సీఎం కాన్వాయ్ వాహనాలను విజయ్ తిరిగి ఇచ్చేశారని, తాము ఉపసంహరించుకోలేదని పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు. అలాగే ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. మే 4న ఫలితాల తర్వాత నాలుగు కాన్వాయ్ వాహనాలను పోలీసు శాఖ అందించింది. అలాగే ఆయన ఇంటి వద్ద కూడా భద్రతను పెంచింది. కాగా.. గవర్నర్ వద్దకు వెళ్లేటప్పుడు విజయ్ ప్రభుత్వ వాహనాన్ని వినియోగించలేదని పార్టీ వర్గాలు వెల్లడించాయి.



# భారత్- వియత్నాం ద్వైపాక్షిక వాణిజ్యం



ద్వైపాక్షిక సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి చేర్చాలని భారత్, వియత్నాం నిర్ణయించాయి. ఆర్థిక, రక్షణ సహకారాన్ని మరింత విస్తరించాలని నిశ్చయించాయి. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్న అవగాహనకు వచ్చాయి. ఇరుపక్షాలు 13 ఒప్పందాలపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందాలు డిజిటల్ చెల్లింపులు, అరుదైన ఖనిజాలు, ఫార్మాస్యూటికల్స్, విద్య, బ్యాంకింగ్, సంస్కృతితో సహా పలు రంగాలలో లోతైన ద్వైపాక్షిక సంబంధాలకు అవకాశం కల్పిస్తాయి. భారత పర్యటనకు వచ్చిన వియత్నాం అధ్యక్షుడు టో లాం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సంయుక్త సమావేశంలో మోదీ ప్రసంగించారు.

భారత్ అనుసరిస్తున్న 'యాక్ట్ ఈస్ట్' విధానంలో వియత్నాం కీలక దేశమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వియత్నాం సహకారంతో ఆసియాన్ దేశాలతో భారత్ సంబంధాలను మరింత విస్తరిస్తామని చెప్పారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి, శ్రేయస్సు కోసం వియత్నాంతో కలిసి భారత్ పని చేస్తుందని తెలిపారు. పహల్గాం ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండించి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశం చేస్తున్న పోరాటంలో అండగా నిలిచినందుకు వియత్నాంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్థిక అనుసంధానతను పెంపొందించేందుకు రెండు దేశాల కేంద్ర బ్యాంకుల మధ్య సహకారాన్ని బలోపేతం చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు మోదీ వెల్లడించారు. ఇందులో భాగంగా యూపీఐ వ్యవస్థను వియత్నాం ఫాస్ట్ పేమెంట్ సిస్టమ్‌తో త్వరలో అనుసంధానం చేయనున్నట్లు ప్రధాని వివరించారు. 2030 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 25 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మోదీ తెలిపారు. ఇరు దేశాల మధ్య భద్రత సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు వియత్నాం అధ్యక్షుడు టో లాం తెలిపారు.

"2030 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 25 బిలియన్ డాలర్లకు తీసుకెళ్లేందుకు అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నాం. మన ఔషధ అధికార వర్గాల మధ్య కుదిరిన ఈ అవగాహన ఒప్పందం వియత్నాంలో భారతీయ ఔషధాల లభ్యతను పెంచుతుంది. వియత్నాంకు భారతీయ వ్యవసాయ, మత్స్య, పశు ఉత్పత్తుల ఎగుమతి కూడా సులభతరం కాబోతోంది. "త్వరలోనే భారతదేశపు ద్రాక్ష, దానిమ్మ పండ్లను వియత్నాం రుచి చూస్తుంది, అలాగే మనం వియత్నాం పోమెలో పండ్లను రుచి చూస్తాము. అంతేకాకుండా, ఈ ఏడాది చివరి నాటికి భారత్–ఆసియాన్ వాణిజ్య ఒప్పందాన్ని ఆధునీకరించడానిక అంగీకరించాం. ఇది భారతదేశానికి, అన్ని ఆసియాన్ దేశాలకు మధ్య వాణిజ్యానికి, పెట్టుబడులకు కొత్త ఊపునిస్తుంది. కీలక ఖనిజాలు, అరుదైన భూలోహాలు, ఇంధన సహకారంలో కొత్త కార్యక్రమాలు మన రెండు దేశాల ఆర్థిక భద్రతను, సరఫరా గొలుసు మెరుగుపరుస్తాయి. అనుసంధానం, సామర్థ్య నిర్మాణం మన భాగస్వామ్యానికి ముఖ్యమైన స్తంభాలు. రెండు దేశాల మధ్య విమాన అనుసంధానం నిరంతరం పెరుగుతుండటం చాలా సంతోషంగా ఉంది."

దక్షిణ చైనా సముద్రంలో చైనా తన సైనిక బలాన్ని పెంచుకుంటున్న విషయం కూడా ఇరుపక్షాల మధ్య జరిగిన ప్రతినిధి బృందం స్థాయి చర్చల్లో ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంతో కలిసి వచ్చిన వియత్నాం అధ్యక్షుడు లామ్, మూడు రోజుల భారత్?లో పర్యటించనున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత ఆయన దేశంలో చేస్తున్న తొలి అధికారిక పర్యటన ఇది. అంతకుముందు మంగళవారం రాష్ట్రపతి భవన్?లో ఘన స్వాగతం లభించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మరియు ప్రధానమంత్రి మోదీ ఆయనకు స్వాగతం పలికారు. దిల్లీకి వచ్చేముందు బిహార్?లోని బోధ్ గయాలోనూ పర్యటించి మహాబోధి ఆలయంలో ప్రార్థనలు చేశారు.

# ఆసక్తికరంగా తమిళ రాజకీయాలు



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా నిలిచిన టీవీకే ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్‌తో సమావేశమైంది. ఈ మేరకు టీవీకే అధినేత విజయ్ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను కలిశారు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని విజయ్ గవర్నర్‌ను కోరారు. అందుకు గవర్నర్ సమ్మతించారు. ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్ సంసిద్ధత వ్యక్తం చేశారు. గురువారమే విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకోసం చెన్నైలోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. 5 వేల మంది అతిరథ మహారథులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య ప్రమాణస్వీకార కార్యక్రమం జరగనుంది.

అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ పార్టీకి 108 సీట్లు రాగా ప్రభుత్వ ఏర్పాటుకు మరో 10 సీట్లు అవసరం ఉంది. ఈ నేపథ్యంలో తమిళ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి షరతులతో కూడిన మద్దతు ఇస్తున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. ఇందుకు సంబంధించి తమిళనాడు కాంగ్రెస్ ఇంఛార్జ్ గిరీశ్ చోడంకర్ సంతకం చేసిన ఓ లేఖను అధికారికంగా విడుదల చేసింది. లౌకిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో టీవీకే అధినేత విజయ్‌కు మద్దతు ఇవ్వాలని తమిళనాడు కాంగ్రెస్ నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అంతకుముందు మంగళవారం రాత్రి తమిళనాడు కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ-ౠాజ అత్యవసరంగా సమావేశమై నిర్ణయం తీసుకుంది. బీజేపీ, దాని మిత్ర పక్షాలు ఎట్టి పరిస్థితుల్లో తమిళనాడులో అధికారం చేపట్టకుండా అడ్డుకునేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని కాంగ్రెస్ చెప్పింది. అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చెన్నైలోని టీవీకే ప్రధాన కార్యాలయానికి వెళ్లి విజయ్‌తో సమావేశమయ్యారు. వాళ్లందరినీ విజయ్ శాలువాలతో సత్కరించారు. ఐదుగురు సభ్యులు ఉన్న కాంగ్రెస్ మద్దతు ఇచ్చినప్పటికీ టీవీకేకు మరో ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతు అవసరం ఉంది. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే కూటమిలోని పీఎంకే కూడా విజయ్‌కు మద్దతు ఇచ్చేందుకు సిద్ధమైంది. పీఎంకేకు నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు.

### ప్రమాణస్వీకారానికి రాహుల్‌గాంధీని ఆహ్వానించిన విజయ్

అటు విజయ్ ప్రమాణస్వీకారానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రానున్నారు. ప్రమాణస్వీకారానికి రాహుల్ గాంధీని విజయ్ ఆహ్వానించినట్లు కాంగ్రెస్ నేత ప్రవీణ్ చక్రవర్తి తెలిపారు. రాహుల్, ఖర్గేతో విజయ్ ఫోన్‌లో మాట్లాడి ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించినట్లు చెప్పారు.

### విజయ్ టీవీకే పార్టీకి మద్దతు ఇచ్చేది లేదన్న లెఫ్ట్ పార్టీలు

ఇదిలా ఉండగా, తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మద్దతు కోరుతూ ౦ఎఖ వివిధ రాజకీయ పార్టీలను సంప్రదిస్తున్న నేపథ్యంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. డీఎంకే మిత్రపక్షమైన ఎజఖ దీనిపై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే, ౦ఎఖ ఆహ్వానించినప్పటికీ, వామపక్ష పార్టీలు, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ మాత్రం విజయ్ పార్టీకి మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశాయి. ఎన్నికల్లో విజయం సాధించిన జూ×(వీ) అభ్యర్థులు ఆర్. చెల్లస్వామి, లతతో పాటు సీపీఐ సభ్యులు టి. రామచంద్రన్, మారిముత్తు డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్‌ను కలిశారు. అటు ×ఖమీ తరపున ఎమ్మెల్యేలుగా ఎన్నికైన సయ్యద్ ఫరూక్ బాషా (ూాదీ), ఏ.ఎం. షాజహాన్ కూడా డీఎంకే అధ్యక్షుడిని కలిశారు. అనంతరం మాట్లాడుతూ తాము డీఎంకేకి తమ మద్దతును కొనసాగిస్తామని సీపీఐ(ఎం), సీపీఐ, ×ఖమీ శాసనసభ్యులు స్పష్టం చేశారు.

### పళనిస్వామితో టీవీకే నేత సమావేశం

ఇదిలా ఉండగా, టీవీకే ప్రధాన కార్యదర్శి చీ ఆనంద్ అన్నాడీఎంకే అధినేత ఎడప్పడి పళనిస్వామితో సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇతర టీవీకే నాయకులు కూడా పళనిస్వామితో చర్చించినట్లు తెలిసింది. ఒక వేళ టీవీకే, 47 సీట్లు ఉన్న అన్నా డీఎంకే జతకడితే ప్రభుత్వ ఏర్పాటు మెజార్టీకి ఎలాంటి ఢోకా ఉండదు.

# లోక్‌సభలో ప్రతి 6వ బీజేపీ ఎంపీ ఓట్ల చోరీ ద్వారానే గెలిచారు

లోక్‌సభలో ప్రతి 6వ బీజేపీ ఎంపీ ఓట్ల చోరీ ద్వారానే గెలిచారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. బీజేపీ పరిభాషలో వారిని 'చౌరబాటుదారులు' అని పిలవాలా అని ప్రశ్నించారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే లోక్‌సభలో బీజేపీ 140 స్థానాలు కూడా గెలుచుకోలేదని రాహుల్ గాంధీ జోస్యం చెప్పారు. ఓట్ల చోరీతో కొన్నిసార్లు వ్యక్తిగత సీట్లు, మరికొన్నిసార్లు ప్రభుత్వమే అపహరణకు గురవుతుందని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. లోక్‌సభలోని 240 మంది బీజేపీ ఎంపీల్లో దాదాపు ప్రతి 6వ ఎంపీ ఓట్ల చోరీతోనే గెలిచారని చెప్పారు. హరియాణాలో మొత్తం ప్రభుత్వమే చౌరబాటుకు గురైందని ఆరోపించారు. ఓటర్ల జాబితాలను, ఎన్నికల ప్రక్రియను వక్రీకరించడానికి వారు తమ జేబులో పెట్టుకున్న సంస్థలు 'రిమోట్ కంట్రోల్'తో నడుస్తున్నాయని ఎన్నికల సంఘంపై పరోక్షంగా విమర్శలు చేశారు. బీజేపీ నేతలు వాస్తవం అంటే భయపడుతున్నారని దుయ్యబట్టారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే ఈరోజు 140 స్థానాలు కూడా వారు గెలుచుకోలేరని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

"ఓట్ల చోరీతో కొన్నిసార్లు వ్యక్తిగత సీట్లు, మరికొన్నిసార్లు ప్రభుత్వమే అపహరణకు గురవుతాయి. లోక్‌సభలోని 240 మంది బీజేపీ ఎంపీల్లో, సుమారు ప్రతి ఆరో ఎంపీ ఓట్ల చోరీ ద్వారానే తన సీటును దక్కించుకున్నారు. వారిని గుర్తించడం కష్టం కాదు. బీజేపీ సొంత పరిభాషలోనే చెప్పాలంటే మనం వారిని 'చౌరబాటుదారులు' అని ముద్ర వేయాలా? ఇక హరియాణా సంగతేంటి? అక్కడ ఏకంగా ప్రభుత్వమే ఒక 'చౌరబాటుదారు'గా ఉంది. వారు తమ జేబుల్లో పెట్టుకుని తిరిగే సంస్థలే ఓటర్ల జాబితాలను, ఎన్నికల ప్రక్రియను వక్రీకరించి దుర్వినియోగం చేస్తున్నాయి. అవన్నీ స్వయంగా 'రిమోట్ కంట్రోల్' ద్వారా నడుస్తున్నాయి. వారికి నిజంగా భయం కలిగించేది సత్యమే. ఎందుకంటే, ఒకవేళ నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే, ఈ రోజు వారు కనీసం 140 సీట్లు కూడా గెలవలేరు." ఇదిలా ఉండగా బంగాల్‌లో ౦వీజ ఓటమిపై కొందరు సంబరపడిపోతున్నారని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. అలా సంతోషం వ్యక్తం చేస్తున్న వారిలో కాంగ్రెస్‌కు చెందిన కొందరు నేతలు సైతం ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ వారంతా ఒక్కటి గుర్తుంచుకోవాలని రాహుల్ సూచించారు. ఇది కేవలం ఒక పార్టీ ఓటమి లేదా గెలుపునకు సంబంధించిన విషయం కాదని, దేశ భవిష్యత్తుకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ మాధ్యమంలో రాహుల్ గాంధీ ఓ పోస్ట్ చేశారు. ప్రస్తుత



పరిస్థితుల్లో స్వార్థ రాజకీయాలను పక్కనపెట్టి, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అందరూ ఏకం కావాలని రాహుల్ పిలుపునిచ్చారు. అసోం, బంగాల్‌లో తీర్పును దొంగిలించడం అనేది, భారత ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలనే లక్ష్యంలో భాగంగా బీజేపీ వేసిన ఒక పెద్ద ముందడుగని రాహుల్ ఆరోపించారు "కాంగ్రెస్‌లోని కొందరు, అలాగే ఇతరులు, ౦వీజ ఓటమిని చూసి సంబరపడుతున్నారు. వారు ఈ విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాలి. అసోం, బంగాల్ ప్రజల తీర్పును అపహరించడం అనేది, భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసే లక్ష్యంలో దీజ్రీ వేసిన ఒక పెద్ద ముందడుగు. చిల్లర రాజకీయాలను పక్కన పెట్టండి. ఇది ఏదో ఒక పార్టీకి సంబంధించిన విషయం కాదు. ఇది భారతదేశానికి సంబంధించిన విషయం."అని రాహుల్? గాంధీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. కాగా, సోమవారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బంగాల్?లో బీజేపీ ఘన విజయం సాధించింది. తృణమూల్ కాంగ్రెస్‌ను ఓడించి అధికారాన్ని చేపట్టింది. అటు అసోంలో వరుసగా మూడో సారి అధికారాన్ని కైవసం చేసుకుంది.

## నూతన ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగుమం



అసోంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగుమం చేస్తూ ముఖ్యమంత్రి పదవికి హిమంత బిశ్వశర్మ రాజీనామా చేశారు. ఈ మేరకు గువాహటిలో లోక్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ లక్ష్మణ్‌ప్రసాద్ ఆచార్యను కలిసి రాజీనామా లేఖను సమర్పించారు. తర్వాత కొద్దినిమిషాలకే హిమంత బిశ్వశర్మ రాజీనామాను గవర్నర్ ఆమోదించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ఆపద్ధర్మ సీఎంగా కొనసాగాలని హిమంతను, గవర్నర్ కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, సీఎం ప్రమాణస్వీకారం మే 11 తర్వాత ఉంటుందని తెలిపారు. 'ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించిన తర్వాత రాజీనామా సమర్పించాం. ప్రస్తుత అసెంబ్లీని రద్దు చేయాలని కూడా నేను గవర్నర్‌ను అభ్యర్థించా. ఆయన నా రాజీనామాను అంగీకరించి, కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకు ముఖ్యమంత్రిగా కొనసాగాలని ఆదేశించారు. కొత్త ప్రభుత్వం త్వరలోనే ఏర్పడుతుందని నేను భావిస్తున్నా. ఈ సమయంలో మేం తాత్కాలిక ప్రభుత్వంగా పనిచేస్తాం' అని బిశ్వ శర్మ పేర్కొన్నారు.

### కొత్త సీఎం ఎంపిక శాసనసభ్యుల సమావేశంలోనే

పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో నూతన సీఎం ఎంపిక జరుగుతుందని హిమంత బిశ్వ శర్మ తెలిపారు. 'రాష్ట్రంలో కొత్త ముఖ్యమంత్రిని బీజేపీ శాసనసభ్యుల సమావేశంలోనే ఎంపిక చేస్తామని తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, జేపీ నడ్డా, బరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనిను కేంద్ర పరిశీలకులుగా నియమించారు. శాసనసభ్యుల సమావేశంలో నేతను ఎన్నుకుంటాం. ఆ తర్వాత లోక్ భవన్‌కు వెళ్లి ప్రభుత్వం ఏర్పాటు కోసం గవర్నర్‌ను కలుస్తాం. కొత్త ప్రభుత్వ ప్రమాణ స్వీకారం మే 11 తర్వాత జరిగే అవకాశం ఉంది. మహోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించాం. ఈసారి సెంచరీతో హ్యాట్రిక సాధించినందుకే ప్రధానిని ఆహ్వానిస్తున్నాం' అని హిమంత బిశ్వ శర్మ తెలిపారు. అసోం నూతన సీఎంగా మరోసారి హిమంత బిశ్వశర్మ పగ్గాలు చేపట్టే అవకాశం ఉంది.

### డిజిటల్ స్ట్రాటజీతో ప్రచారం

అసోం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయానికి డిజిటల్ వ్యూహం కీలక పాత్ర పోషించింది. ఈ వ్యూహం వల్ల ఎన్?డీఏ 100కి పైగా స్థానాలు సాధించింది. దీంతో మూడోసారి అధికారంలోకి వచ్చింది. బీజేపీ డిజిటల్ టీమ్, సోషల్ మీడియాలో కథనాలు, మీమ్స్, యువతను ఆకట్టుకునే కంటెంట్ ద్వారా ఎన్నికల వాతావరణాన్ని పూర్తిగా తమవైపు మళ్లించింది.

### 'మామా' ఇమేజ్‌తో ప్రజలలో విశ్వాసం

సీఎం హిమంత బిశ్వ శర్మను 'మామా'గా ప్రజల్లో ప్రతిష్ఠిస్తూ, ఆయనను స్థానిక సంస్కృతికి రక్షకుడిగా చూపించింది. అభివృద్ధి, ఆధునికత, ప్రాంతీయ గౌరవం అనే అంశాలను కలిపి బలమైన కథనాన్ని రూపొందించింది. ఈ డిజిటల్ ప్రచారం ద్వారా ప్రతిపక్షాన్ని, ముఖ్యంగా కాంగ్రెస్?ను తీవ్రంగా లక్ష్యంగా చేసుకుంది. బీజేపీ ప్రచారం కాంగ్రెస్‌ను అసోం అభివృద్ధికి అడ్డంకిగా చూపించింది. అక్రమ వలసదారులకు మద్దతు ఇస్తోందనే ఆరోపణలతో కాంగ్రెస్‌పై ప్రతికూల భావనను పెంచింది. ఈ నారేటివ్ ప్రజల్లో విస్తృతంగా వ్యాపించి, ప్రతిపక్షానికి పెద్ద దెబ్బగా మారింది.

### ఎన్నికల్లో ఎన్‌డీఏ ఆధిపత్యం

అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్?డీఏ ఘన విజయం సాధించింది. మొత్తం 126 స్థానాల్లో 102 సీట్లు గెలుచుకుని వరుసగా మూడోసారి అధికారంలోకి రాబోతోంది. బీజేపీ 82 స్థానాలు గెలుచుకోగా, ఏజీపీ, బీఓపీఎఫ్ తలో 10 స్థానాలు సాధించాయి. ఇక కాంగ్రెస్ కేవలం 19 స్థానాల్లో మాత్రమే గెలుపొందింది. రైజోర్ దళ్ 2 స్థానాలు గెలుచుకోగా, ఏఐయూడీఎఫ్ కూడా 2 స్థానాలు సాధించింది. అసోం జాతీయ పరిషత్ (ఏజేపీ) ఒక్క సీటు కూడా గెలుచుకోలేకపోయింది.

## పంజాబ్‌లో హైఅలర్ట్

పంజాబ్ వరుస పేలుళ్లతో దద్దరిల్లింది. రెండు గంటల్లోనే 2 చోట్ల పేలుళ్లు చోటుచేసుకోవడం తీవ్ర కలకలం రేపింది. ఈ రెండు ఘటనలూ ఆర్మీ యూనిట్‌లకు సమీపంలోనే జరగడం మరింత ఆందోళనలకు గురు చేస్తోంది. జలంధర్, అమృత్‌సర్ నగరాల్లో ఈ పేలుళ్లు జరిగాయి. దీంతో పంజాబ్ వ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించారు. ఈ క్రమంలోనే స్పందించిన అధికారులు, ఈ పేలుడులో ఏదైనా కుట్రకోణం ఉందా అనే దానిపైనా దర్యాప్తు చేపట్టారు. అటు జాతీయ దర్యాప్తు సంస్థ అధికారులు సైతం ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించనున్నారు. పంజాబ్‌లోని జలంధర్‌లో బీఎస్‌ఎఫ్ ప్రధాన కార్యాలయం గేటు వద్ద స్కూటర్ పేలుడు కలకలం రేపింది. కంటోన్మెంట్ పరిధిలో మంగళవారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. భద్రత పరంగా అత్యంత సున్నితమైన ప్రదేశంలో భారీ పేలుడు జరగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సాంకేతిక కారణాలా లేక కుట్ర ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న సీసీటీవీ ఫుటేజీలో పేలుడు ఘటన నమోదైంది. రాత్రి దీూఖీ హెడ్‌క్వార్టర్స్ ముందు ఉన్న యాక్టివ్ స్కూటర్ ఒక్కసారిగా పేలిపోయింది. వెంటనే మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అక్కడున్న యువకుడు పారిపోతున్నట్లు కనిపించింది. పెద్ద శబ్దంతో పేలుడు జరగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే పోలీసులు డ్వాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపారు. మిలటరీ కంటోన్మెంట్ మొత్తాన్ని దిగ్బంధించి సోదాలు చేస్తున్నారు. నిఘా, పెట్రోలింగ్ ముమ్మరం చేశారు. ఫుటేజీలో కనిపిస్తున్న యువకుడిని గుర్తించి, అతని కదలికలను పరిశీలించేందుకు ప్రయత్నిస్తున్నారు. జలంధర్ నగరం అంతటా భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

### కంటోన్మెంట్ పరిధిలో పేలుడు

మరోవైపు ఈ ఘటన జరిగిన రెండు గంటల తర్వాత అమృత్‌సర్‌లో మరో పేలుడు జరిగింది. అటారీ రోడ్డులోని ఆర్మీ ఖాసా కంటోన్మెంట్ పరిధిలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రదేశంలో రేకును పోలిన శకలాలు దొరికాయని, దీంతో ఎవరో పేలుడు పరికరాన్ని విసరడం వల్లే ఈ ఘటన జరిగిందని పోలీసులు అనుమానిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు మాస్కులు ధరించి, దాడి చేసి, ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయినట్లు ప్రాథమిక విచారణలో తెలిందింది. అయితే, ఈ రెండు ఘటనలకు ఏదైనా సంబంధం ఉందా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు. పేలుళ్ల ఘటనపై స్పందించిన ప్రతిపక్షాలు, ప్రభుత్వం విఫలమైందని, నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించాయి.

### జంట పేలుళ్లను చిన్నవిగా అభివర్ణించిన పంజాబ్ ముఖ్యమంత్రి

అమృత్‌సర్, జలంధర్‌లో జరిగిన జంట పేలుళ్లను చిన్నవిగా అభివర్ణించారు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్. రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలకు ఆ పార్టీ ఈ విధంగానే సిద్ధమవుతోందని ఆరోపించారు. బీజేపీ భయానక వాతావరణం సృష్టించాలని చూస్తోందని, ప్రజలను భయపెట్టి ఓట్లు రాబట్టాలని ఆ పార్టీ భావిస్తోందని విమర్శించారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని ఆయన చెప్పారు. "బీజేపీ ఒక మతతత్వ పార్టీ. బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి, ఇప్పుడు పంజాబ్ వంతు అని బీజేపీ చెబుతోంది. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగానే ఈ చిన్నపాటి పేలుళ్లు జరిగాయనిపిస్తోంది. ఇలాంటి ఎత్తుగడలను మానుకోవాలని నేను బీజేపీని కోరుతున్నాను. పంజాబ్ ఒక శాంతియుత రాష్ట్రం. మేము ఎల్లప్పుడూ ప్రపంచ సంక్షేమాన్ని కోరుకునే వాళ్లం." అని ముఖ్యమంత్రి అన్నారు.

### పాకిస్థాన్ పన్నిన 'ఐఎస్ఐ' కుట్రలో భాగంగానే పేలుళ్లు : డీజీపీ

అమృత్‌సర్, జలంధర్‌లలో జరిగిన స్వల్ప తీవ్రత గల పేలుళ్ల ఘటనా స్థలాలను పంజాబ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) గౌరవ్ యాదవ్ బుధవారం పరిశీలించారు. రాష్ట్రంలో శాంతికి భంగం కలిగించేందుకు పాకిస్థాన్ మద్దతు ఉన్న శక్తులు ఈ ఘటనలో పాల్గొన్నట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు చెప్పారు. పంజాబ్‌లో అశాంతి సృష్టించేందుకు పాకిస్థాన్ పన్నిన 'ఐఎస్ఐ' కుట్రలో భాగంగానే ఈ ఘటన కనిపిస్తోందని డీజీపీ అన్నారు. ఆపరేషన్ సింధూర్ వార్షికోత్సవం నేపథ్యంలో పంజాబ్‌లో అల్లర్లు సృష్టించేందుకు పాకిస్థాన్ ఐఎస్ఐ పన్నిన కుట్రలో ఇది ఒక భాగమని మేము అనుమానిస్తున్నామన్నారు.

## భూభారతి' ద్వారా గిరిజన రైతు భూమి సమస్య పరిష్కారం

- కలెక్టర్ రాజర్షి షా చొరవ.భూభారతి' ద్వారా గిరిజన రైతు భూమి సమస్య పరిష్కారం
- కలెక్టర్ రాజర్షి షా చొరవ.



**ఆదిలాబాద్, మే : 07 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
ఆదిలాబాదు జిల్లా కలెక్టర్ రాజర్షిషా క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. ఇందులో భాగంగా, భీంపూర్ మండలం గొల్లఘాట్ గ్రామానికి చెందిన ఆదివాసీ రైతు మడవి గంగారాం గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న భూ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. సర్వే నంబర్ 74/1/3 లో గల 9.00 ఎకరాల సాగు భూమి గతంలో 'నిషేధిత జాబితా' (ఇనాం భూమి)లో ఉండటంతో పట్టా పొందడానికి వీలు లేకుండా పోయింది. రైతు గంగారాం సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి 'భూభారతి' చట్టం ద్వారా సమస్యను పరిష్కరించాలని భీంపూర్ తహసీల్దార్ బానోత్ రమేష్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయి విచారణ పూర్తి చేసి, నిబంధనల ప్రకారం ఆ భూమిని రైతు పేరిట నమోదు చేసి పట్టాదారు పాస్ పుస్తకాన్ని అందజేశారు. దశాబ్దాల కల సాకారమవడంతో రైతు గంగారాం ఆనందం వ్యక్తం చేస్తూ, తనకు అండగా నిలిచిన జిల్లా కలెక్టర్ ను కలెక్టర్ కార్యాలయంలో కలిసి ఆయనకు, రెవెన్యూ యంత్రాంగానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## నిర్మల్ జిల్లా కలెక్టర్‌ను కలిసిన ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి.విట్టల్ రెడ్డి




**నిర్మల్-ముధోల్: మే 07 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నియోజకవర్గంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాల్లో మక్కా,జొన్న పంటలు దగ్ధమై రైతులకు భారీ నష్టం వాటిల్లిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే జి.విట్టల్ రెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గత వారం రోజులుగా పలు గ్రామాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పంటలు కాలిపోవడంతో సన్న, చిన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అప్పులు చేసి ఎంతో ఖర్చుతో పండించిన పంటలు మార్కెట్‌కు తీసుకెళ్లే సమయంలోనే అగ్నికి ఆహుతి కావడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులను గుర్తించి తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

## రాష్ట్ర స్థాయిలో సైనిక్ సీటు సాధించిన సాయి ఎక్సలెంట్ స్కూల్ విద్యార్థులు



**జూలూరుపాడు: మే 07 ( తెలంగాణ వాణి ప్రతినిధి):**
మండల కేంద్రంలోని పాపకొల్లు రోడ్డు నందు ఉన్న సాయి ఎక్సలెంట్ స్కూల్ లో సోడే నరేంద్రనాథ్ ,భగవత్ అనే ఇద్దరు విద్యార్థులు సైనిక్ పాఠశాలలో సీటు సాధించడం జరిగిందని ,గురువారం పాఠశాల డైరెక్టర్ జక్కుల శివకుమారి విద్యార్థిని అభినందించి స్వీట్ తినిపించి,వివరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాయి ఎక్సలెంట్ స్కూల్లో సైనిక్ సీటు రాష్ట్ర స్థాయిలో సాధించి మండలానికి మంచి పేరు తెచ్చినందుకు విద్యార్థి నరేంద్రనాథ్ భగవత్, తండ్రి శ్రీ రాములును అభినందించారు. సైనిక్ సీటు కోసం విద్యార్థి పట్ల శ్రద్ధ కలిగి కృషిచేసిన ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మునుముందు ఇంకా కాంపిటేటివ్ పరీక్షల్లో సాయి ఎక్సలెంట్ స్కూలు మరెన్నో విజయాలు సాధించాలని ఆశా భావం వ్యక్తం చేశారు. సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధిస్తూ,రాష్ట్ర స్థాయిలో పేరు గడించినందుకు విద్యార్థిని మరియు తల్లిదండ్రులకు, ముఖ్యంగా ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఆరెబోయిన హుస్సేన్, పాఠశాల ఉపాధ్యాయులు రమేష్, నభీన, ప్రశాంతి, విద్యార్థిని తండ్రి సోడే శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ గా జువ్వాడి నర్సింగరావు

**జువ్వాడి నర్సింగరావు కు నియామక పత్రశీ అందజేసిన టీ పీసీసీ అధ్యక్షులు,ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్.**



**కోరుట్ల:మే 07(తెలంగాణ వాణి)**
తెలంగాణ రాష్ట్ర వెలమ సంక్షేమ శాఖ కార్పో రేషన్ చైర్మన్ గా ఎన్నికైన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి జువ్వాడి నర్సింగరా వు కు నియామక పత్రశీ హైదరాబాద్ గాంధీ భవన్ లో టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్గౌడ్,పెద్ద పల్లి,భూపాలపల్లి ఎమ్మెల్యేలు విజయరమణా రావు,సత్యనారాయణరావులను శాలువాలతో సన్మానించి ధన్యవాదాలు తెలిపా రు.ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగ రావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంత పెద్ద బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహార ఇంచార్జి మీనాక్షి నటరాజన్,తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గ ప్రభుత్వ పెద్దలకు జువ్వాడి నర్సింగరావు ప్రత్యేక తెలిపారు.

# మానవీయ, సాంఘిక శాస్త్రాల ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్న గీతం

**పటాన్ చెరు, మే 7,(తెలంగాణ వాణి రిపోర్టర్):**
గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) 2026-27 విద్యా సంవత్సరానికి గాను మానవీయ, సాంఘిక శాస్త్రాలలో యూజీ, పీజీ, పీహెచ్.డీ. కోర్సులలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ విషయాన్ని ఆ స్కూల్ ఇన్ ఛార్జి డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ థరు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. జాతీయ లేదా రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షలలో పొందిన చెల్లుబాటు అయ్యే స్కోర్ల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని, అలాగే గీతం ప్రవేశ పరీక్ష (గాట్-2026) ద్వారా కూడా అర్హత సాధించవచ్చని ఆయన తెలియ జేశారు. మూడో దశ ప్రవేశ పరీక్ష ఈనెల 17 న జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను మే 14 వ తేదీలోగా అధికారిక పోర్టల్ ద్వారా ఆన్ లైన్లో సమర్పించ వచ్చన్నారు.యూజీ స్థాయిలో- సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషు, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, జర్నలిజం అండ్ మీడియా స్టడీస్, సోషియాలజీ, సినిమాటిక్ ఆర్ట్స్ అండ్ డిజైన్లు ప్రధాన అంశం (మేజర్)గా బీ.ఏ. కోర్సును అంద జేస్తున్నామని తెలిపారు. వీటిలో చేరిన విద్యార్థులకు వారు ఎంచుకున్న విభాగాలలో బలమైన పునాదిని అందించడంతో పాటు, వారి విశ్లేషణాత్మక, సృజనాత్మక, భావ ప్రకటనా నైపుణ్యాలను మెరుగు



పరిచేలా ఆయా కోర్సులను రూపొందించామని తెలిపారు. లిబరల్ ఎడ్యుకేషన్ లో భాగంగా, విద్యార్థుల ఆసక్తి, ఆశయాల ఆధారంగా 600కు పైగా సబ్జెక్టుల కలయికలను ఎంచుకోవచ్చన్నారు. పీజీ స్థాయిలో- అప్లైడ్ సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషులలో ఎం.ఏ. కోర్సులను అందిస్తున్నామని తెలిపారు. ఇవి ఉన్నతమైన సైద్ధాంతిక పరిజ్ఞానం, పరిశోధనా సామర్థ్యాలు, ఆచరణాత్మక అనువర్తనాల పై దృష్టి పెడతాయన్నారు. ఇక డాక్టోరల్ కోర్సులలో- అప్లైడ్ సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషు, పొలిటికల్ సైన్స్, సోషియాలజీలలో పీహెచ్.డీ. కోర్సులు ఉన్నాయని ఆయన తెలియజేశారు. ఈ రంగాలలో ఉన్నత-నాణ్యత గల పరిశోధన, విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడ మే వీటి లక్ష్యమన్నారు. విద్యతో పాటు క్రీడలు, ఇతరత్రా కార్యకలాపాలు, సామాజిక పరస్పర చర్యలతో అనుసంధానించడం ద్వారా సంపూర్ణ విద్యకు జీఎస్ హెచ్ఎస్ ప్రాధాన్యత ఇస్తోందని డాక్టర్ శామ్యూల్ వివరించారు. అత్యాధునిక బోధనా ప్రయోగశాలలు, విస్తృతమైన ఇంటర్న్‌షిప్ అనుభవం, పరిశోధనపై దృష్టి సారించే అధ్యాపక బృందం సమగ్రమైన బోధనను అందించడంలో సహాయపడుతుందని తెలిపారు. విద్యాపరమైన విజయాలకు అతీతంగా విద్యార్థులను తీర్చిదిద్ది, విజ్ఞానవంతమైన దృక్పథాలు, విమర్శనాత్మక ఆలోచనల ద్వారా సమాజానికి అర్థవంతంగా దోహదపడేలా వారికి సాధికారత కల్పించడానికి గీతం కట్టుబడి ఉందన్నారు. గీతం లోని దాదాపు 33 శాతం మంది విద్యార్థులు ప్రతిభ ఆధారిత ఉపకార వేతనాలు పొందుతున్నారని, వీటిలో బోధనా రుసుము, భోజనం, వసతి ఖర్చులతో సహా పూర్తి మినహాయింపులున్నాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 14వ తేదీలోగా ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకుని, మే 17న జరిగే ప్రవేశ పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఇతరత్రా సమాచారం కోసం **www.gitam.edu** ను సందర్శించాలని, లేదా 888 4984 000 ను సంప్రదించాలని సూచించారు.

## సాకి చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్ చెరు, మే 7, (తెలంగాణ వాణి రిపోర్టర్):**
చెరువుల సంరక్షణ కోసం శరవేగంగా గుర్రపు డెక్క తొలగింపు పనులను చేపడుతున్నట్లు పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువులో 70 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న గుర్రపు డెక్క తొలగింపు పనులను గురువారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమయ్యే లోపు పనులు పూర్తి కావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని తిమ్మక్క చెరువు, జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని దోషం చెరువులలోను ఒక కోటి రూపాయల అంచనా వ్యయంతో అతి త్వరలో గుర్రపు డెక్క తొలగింపు పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. గుర్రపు డెక్క తొలగించడం వలన చెరువు నీటి



సామర్థ్యం పెరగడంతో పాటు చెరువుల పరిశుభ్రత మెరుగు పడటం, భూగర్భ జలాలు మట్టం పెరగడం వంటి లాభాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, సపాన దేవ్, మార్కెట్ కమిటీ మాజీ



చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నివార్తి దేవ్, ఎట్టయ్య, టప్పు కుమార్, నర్రా బిక్షపతి, వెంకటేష్, సత్తయ్య, రామ్మోహన్, ఏఈ ఫైజాన్, తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ లో ఉన్న భూ భారతీ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

**జయశంకర్ భూపాలపల్లి (తెలంగాణ వాణి)**
పెండింగ్ లో ఉన్న భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తహసీల్దార్లను ఆదేశించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం భూ భారతి, సాదా బైనామా, బల్క్ భూ సమస్యలు తదితర అంశాలపై అన్ని మండలాల తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతీలో అందిన ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. అలాగే సాదాబైనామల సమస్యలను కూడా జాప్యం చేయకుండా పరిష్కరించాలని పేర్కొన్నారు. దరఖాస్తు దారులకు నోటీసులు అందించి సత్వరం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో పలు మండలాల్లో ఉన్న బల్క్ ల్యాండ్ సమస్యలను పూర్తిగా



పరిష్కరించేందుకు తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందించాలని



సూచించారు. ఈ సమావేశంలో ఆర్డిఓ బాలకృష్ణ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏ డి కుసుమ కుమారి, అన్ని మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## 102 ఏళ్ల వృద్ధురాలికి విజయవంతమైన నడుము శస్త్రచికిత్స

- యశోద ఆసుపత్రి వైద్యుల నైపుణ్యంతో మళ్లీ స్వతంత్ర జీవితం
- వివరాలు వెల్లడించిన డా. వివేకానంద భీమిశెట్టి

**కరీంనగర్ (తెలంగాణ వాణి)**
వేములవాడకు చెందిన 102 ఏళ్ల వృద్ధ మహిళ సత్తమ్మ కుడి నడుము ఎముక విరిగింది. ఈ సమస్యపై యశోద ఆసుపత్రి ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణుడు డా. వివేకానంద భీమిశెట్టి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించామని, గురువారం రోజున యశోద హాస్పిటల్ కరీంనగర్ బ్రాంచ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డా వివేకానంద మాట్లాడుతూ, వైద్య పరీక్షల్లో ఆమెకు కుడి నడుములో ఇంటర్ ట్రోకాంటెరిక్ విరిగిన విషయాన్ని గుర్తించామని అధిక వయస్సు కారణంగా శస్త్రచికిత్సకు ప్రమాదాలు ఉన్నప్పటికీ, వైద్య




బృందం సమగ్ర ప్రణాళికతో చికిత్స చేపట్టిందన్నారు. డా.వివేకానంద భీమిశెట్టి నడుము ఎముకను సరిచేసే శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. సమయానుకూల వైద్య జోక్యం, ఆధునిక చికిత్స విధానాల కారణంగా రోగిని శస్త్రచికిత్స అనంతరం మరుసటి రోజే నడవడానికి సహాయపడ్డారు. రెండు వారాల్లోనే ఆమె రోజువారీ పనులను స్వయంగా చేసుకునే స్థాయికి చేరుకుందన్నారు. శస్త్రచికిత్స జరిగిన మూడు నెలల్లోనే వృద్ధురాలు పూర్తిగా కోలుకొని ప్రస్తుతం తన స్వగ్రామంలో స్వతంత్రంగా జీవిస్తోంది. అత్యంత ప్రమాదంలో ఉన్న వృద్ధ రోగులకైనా వేగవంతమైన శస్త్రచికిత్స, నిపుణుల వైద్య సంరక్షణ అందితే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని ఈ ఘటన మరోసారి నిరూపించిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సోమాజిగూడ ఇంచార్జి రాజు, కరీంనగర్ బ్రాంచ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే వేతనాలు నిలిపివేస్తాం

- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్ (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) సన్నాహక ప్రక్రియను ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్ అమలు తీరు,పై కలెక్టర్ గురువారం నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో ఏ.ఈ.ఆర్.ఓలు, బీ.ఎల్.ఓ సూపర్వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఒక్కో పోలింగ్ కేంద్రం వారీగా ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్ అమలును పరిశీలిస్తూ, పనితీరులో వెనుకంజలో ఉన్న ఏ.ఈ.ఆర్.ఓలు, బీ.ఎల్.ఓ సూపర్వైజర్లను కారణాలు అడిగి తెలుసుకున్నారు. అర్బన్ లో మ్యాపింగ్ ప్రక్రియ మందకొడిగా సాగడం వల్ల నిజామాబాద్ జిల్లా సగటుపై ఇది ప్రభావం చూపుతోందని అన్నారు. ఎస్.ఐ.ఆర్ అమలులో స్పష్టమైన ప్రగతి సాధించాల్సిందేనని స్పష్టం చేశారు. ఒక్కో పోలింగ్ కేంద్రం వారీగా బీఎల్ఓలతో మ్యాపింగ్ ను పక్కాగా జరిపించాలని, రోజువారీగా నిశిత పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. ఎస్.ఐ.ఆర్ సన్నాహక ప్రక్రియ అమలులో పురోగతిపై తాను వారం రోజుల తర్వాత మళ్ళీ సమీక్ష నిర్వహిస్తానని అన్నారు. స్పష్టమైన పురోగతి కనిపించాలని, ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, వారి వేతనాలు నిలిపివేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పనితీరు సక్రమంగా లేని



ఇద్దరు ఆర్.పీలకు షోకాజ్ నోటీసులు అందించి విధుల నుండి తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తన అనుమతి లేకుండా బీఎల్ఓ ల మార్పులు, చేర్పులు చేయకూడదని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో బోగస్ ఓటర్లు, చనిపోయిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు ఉండరాదని, అదే సమయంలో అర్హులైన ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుండి తప్పిపోకూడదని అన్నారు. ఓటరు జాబితా పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రత్యేక సమగ్ర సవరణను ఎన్నికల సంఘం చేపట్టిందని అన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకునేలా చూడాలని, మ్యాపింగ్ ప్రక్రియ పురోగతి కోసం వారి సహకారం తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక సమరణ ప్రక్రియ చేపట్టడం వల్ల ఓటరు జాబితాలో నిజమైన ఓటరు ఖచ్చితంగా ఉంటారని తెలిపారు. డూప్లికేట్ ఓటర్లతో పాటు మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిపోయిన, రెండు ఓట్లు ఉన్నవాళ్ల ఓట్లు మాత్రమే తొలగిస్తారని తెలిపారు. ఎవరూ అపోహకు గురి కావద్దని కలెక్టర్ సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ తరువాత ఎవరైనా ఓటు హక్కు రాని వారు ఉంటే ఆక్షేపణ చేయవచ్చని అన్నారు. సమీక్షలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్, నిజామాబాద్ సౌత్ తహసీల్దార్ శ్రీధర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో అటవీ శాఖ 'పెద్ద'లు

**3.5 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన ఎఫ్డీఓ, డీఆర్ఓ**



**భద్రాచలం (తెలంగాణ వాణి)**

అటవీ శాఖలో అవినీతి తిమింగలాలు మరోసారి ఏసీబీకి చిక్కాయి. రోడ్డు పనుల వ్యవహారంలో కేసు నమోదు చేయకుండా ఉండేందుకు భారీగా లంచం డిమాండ్ చేసిన భద్రాచలం డివిజనల్ అటవీ అధికారి, సెక్షన్ ఆఫీసర్ గురువారం రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. చర్ల మండలం పూసుగుప్ప ప్రాంతంలో కొత్తగా రోడ్డు వేస్తున్న క్రమంలో కొన్ని అటవీ శాఖ చెట్లు దెబ్బతిన్నాయి. ఈ విషయాన్ని సాకుగా చూపి, సదరు కాంట్రాక్టర్, బాధ్యులపై కేసు నమోదు చేయకుండా ఉండాలంటే 10 లక్షలు సమర్పించుకోవాలని భద్రాచలం ఎఫ్డీఓ సుజాత డిమాండ్ చేశారు. బాధితుడు ఏసీబీని ఆశ్రయించడంతో, డిఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో అధికారులు వ్యూహం రచించారు. గురువారం భద్రాచలం కార్యాలయంలో తొలి విడతగా 3.5 లక్షలు లంచం తీసుకుంటుండగా ఎఫ్డీఓ సుజాతతో పాటు, చర్ల ఇన్చార్జ్ డీఆర్ఓ కృష్ణయ్యను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అవినీతికి పాల్పడే ఏ అధికారిని వదిలే ప్రసక్తే లేదని, బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని ఏసీబీ డిఎస్పీ వై. రమేష్ తెలిపారు. గతంలో కూడా కొత్తగూడెం అటవీ అభివృద్ధి సంస్థకు చెందిన జిల్లా అధికారి మూడున్నర లక్షల రూపాయలు లంచం తీసుకుంటూ పట్టుబడటం గమనార్హం. వరుస ఘటనలతో అటవీ శాఖలో అవినీతి ఏ స్థాయిలో పేరుకుపోయిందో అర్థమవుతోందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

## నవజ్యోతి పాఠశాల విద్యార్థులను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ (తెలంగాణ వాణి)**

కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ షాపూర్ నగర్ , నివాసంలో గిరి నగర్ డివిజన్ పరిధిలోని నవజ్యోతి పాఠశాలలో విద్యను అభ్యసించిన 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు కనబరిచిన ఆ పాఠశాల విద్యార్థులను, అభినందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థిని విద్యార్థులందరూ మరింత ఉన్నతమైన ఫలితాలను సాధించి జీవితంలో మంచి స్థాయికి వివిధ రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు..అదేవిధంగా అత్యున్నతమైన ఫలితాలు సాధించిన పలువురు విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో శ్రీశైలం గౌడ్ నగదు బహుమతి విద్యార్థులకు అందజేశారు. ఈ ఫలితాలను సాధనకు కృషిచేసిన పాఠశాలలోని ఉపాధ్యాయ బృందానికి శుభాకాంక్షలు అభినందనలు తెలియపరుస్తూ ప్రతి సంవత్సరం ఇలాగే ఉన్నత ఫలితాలను పాఠశాల యజమాన్యం సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఇంద్రా రెడ్డి , స్కూల్ ఇన్చార్జ్ రామిరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణారెడ్డి, ఉపాధ్యాయ బృందం , విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు...

## యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- **ప్రభుత్వం మరిన్ని అవకాశాలు కల్పించాలి...**
- **తమ ట్రస్ట్ ద్వారా త్వరలో ఐటీ కంపెనీల్లో ఉద్యోగ మేళా..**



**నిజామాబాద్ మే 08: (తెలంగాణ వాణి ప్రతినిధి)**

నిరుద్యోగ యువత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నగరంలోని శ్రీరామ గార్డెన్ లో నిర్వహించిన జాబ్ మేళాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలు అందరికీ రావడం కష్టమని, కావున అందిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కష్టపడి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వం ఏర్పాటు చేసిన మేళాలో ఎక్కువగా ఐటీ కంపెనీలు ఉండేలా చూడాలన్నారు. చాలామంది యువత రిజిస్ట్రేషన్ చేసుకుని ఉద్యోగాలు చేరడం లేదని, అలాకాకుండా అనుభవం వచ్చేవరకు ఉద్యోగం చేయాలని తెలిపారు. ధన్ పాల్ లక్ష్మీబాయి విట్టల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తొందర్లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎక్కువ శాతం ఐటి కంపెనీలు ఉండేలా చూస్తామన్నారు. అనంతరం ఉద్యోగాలు పొందిన పలువురికి పత్రాలను అందజేశారు కార్యక్రమంలో బిజెపి కార్పొరేటర్లు స్రవంతి రెడ్డి మఠం పవన్, వైష్ణవి సుధా, మురళి జ్యోతి, అర్చన చిరంజీవి జిల్లా యువజన క్రీడల అధికారి పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బోధనేతర సిబ్బంది బదిలీలకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానం

**ల్లా విద్యాశాఖాధికారి జి. శారద**

**పెద్దపల్లి:మే, 07 (తెలంగాణ వాణి ప్రతినిధి )**

పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్ , ఆఫీస్ సబార్డినేట్ బదిలీలకు సంబంధించి జిల్లా విద్యాశాఖాధికారి జి. శారద గురువారం ఒక ప్రకటన తెలిపారు.?01.01.2026 నాటికి 3 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన వారు బదిలీలకు అర్హులు, 31.12.2025 నాటికి ఒకే చోట 4 సంవత్సరాల సర్వీస్ నిండిన వారు తప్పనిసరిగా బదిలీకి దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన సిబ్బంది మే 08 నుండి 15 మే వరకు స్కూల్ లేదు తెలంగాణ . గౌ ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో అప్లై చేసిన దరఖాస్తు కాపీతో పాటు, సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుని సంతకంతో కూడిన సర్వీస్ రిజిస్టర్ జిరాక్స్ కాపీ మే15 సాయంత్రం 5:00 గంటల లోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని, ?జిల్లాలోని అర్హులైన బోధనేతర సిబ్బంది ఈ అవకాశాన్ని వినియోగించుకుని నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రభుత్వ భూములపై అక్రమ కబ్జాలు, రిజిస్ట్రేషన్లపై కఠిన చర్యలు

**ప్రభుత్వ ఆధీనంలోకి 72 ఎకరాల ప్రభుత్వ భూమి**

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**ధర్మారం (తెలంగాణ వాణి)**

ధర్మపురి ఎమ్మెల్యే రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమర్పించిన ఫిర్యాదు మేరకు ధర్మారం మండలం బొమ్మారెడ్డిపల్లి శివారు సర్వే నెం. 679లో జరిగిన చట్టవిరుద్ధ లావాదేవీలు, అక్రమ రిజిస్ట్రేషన్లపై విచారణ చేపట్టి ప్రభుత్వం తగు చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం 16.05.2025న సమర్పించిన ఫిర్యాదుపై రెవెన్యూ శాఖ మంత్రి ఆదేశాల మేరకు పెద్దపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారిని విచారణ అధికారిగా నియమించగా డివిజనల్ అధికారి సమర్పించిన నివేదికలో సర్వే నెం. 679 లో మొత్తం భూమి 670.22 ఎకరాల ప్రభుత్వ పోరంబోగు భూమి అని వెల్లడైనట్లు తెలిపారు. 1347 ఫాసలీ సంవత్సరంలో దేవి పెద్ద లచ్చిగా అనే వ్యక్తికి 72.03 ఎకరాల భూమిపై తాత్కాలిక సాగు అనుమతి మాత్రమే ఇచ్చినట్లు,



ఎటువంటి అసైన్మెంట్ జరగలేదని విచారణలో తేలినట్లు పేర్కొన్నారు. తాత్కాలిక అనుమతిని ఆసరాగా చేసుకుని వారి వారసులు అక్రమంగా రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేయించుకున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా ఆ భూములను తదుపరి 11 మంది ఇతరులకు చట్టవిరుద్ధంగా రిజిస్ట్రేషన్లు, పట్టా మార్పిడులు చేసినట్లు విచారణలో బయటపడినట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి విచారణ నిర్వహించిన అనంతరం వారి పట్టాదారు హక్కులు చెల్లవని నిర్ధారిస్తూ కార్యావర్తనములు నెం. ఈ3/434/2026, తేదీ 27.04.2026 ద్వారా సమాచారం అందజేసి, 72.03 ఎకరాల భూమిని ప్రభుత్వ ఖాతాకు బదిలీ చేసినట్లు వెల్లడించారు. తదనంతరం ఆ భూమిని తహశీల్దార్ ధర్మారం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూమి ఆక్రమణ చట్టరీత్యా శిక్షార్హమని హెచ్చరిస్తూ హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.జిల్లాలో ఎవరైనా ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించి ఉన్నా, అక్రమ రిజిస్ట్రేషన్లు లేదా పట్టా మార్పిడులు చేసుకుని ఉన్నా, ఫోర్జరీ పత్రాలతో ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని ఉన్నా స్వచ్ఛందంగా సంబంధిత తహశీల్దార్ల ద్వారా ప్రభుత్వానికి అప్పగించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. లేనిపక్షంలో గుర్తించిన వెంటనే అక్రమ పట్టాలను రద్దు చేసి భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడంతో పాటు సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ చర్యలు కూడా తీసుకుంటామని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

# మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

**-యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్, ఎమ్మెల్యే పిలుపు**

**నిజామాబాద్, మే 07 : (తెలంగాణ వాణి ప్రతినిధి)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా టాస్క్ సౌజన్యంతో జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని శ్రీరామ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. నిజామాబాద్, కామారెడ్డి లతో కూడిన ఉమ్మడి జిల్లా నుండి పెద్ద సంఖ్యలో యువత జాబ్ మేళాకు తరలివచ్చారు. 71 కంపెనీల ద్వారా సుమారు 2000 మందికి ఉద్యోగాలు కల్పించబడ్డాయని నిర్వాహకులు ప్రకటించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి తదితరులు విచ్చేసి, జాబ్ మేళాను లాంఛనంగా ప్రారంభించారు. వివిధ కంపెనీలలో ఉద్యోగాల కోసం ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందని అన్నారు. సుమారు రెండు వేల మందికి నేరుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని, మరికొందరికి అప్రెంటిస్ షిప్



ద్వారా శిక్షణ కోసం ఎంపిక చేశారని అన్నారు. ఈ తరహా అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ, దేశంలో ఎక్కడలేని విధంగా రాష్ట్రంలో నిరుద్యోగ అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, నైపుణ్యాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని అన్నారు. అందుకు గాను స్కిల్ యూనివర్సిటీని సైతం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిజామాబాద్ లో ఇంత పెద్ద స్థాయిలో జాబ్ మేళా నిర్వహించడం



అభినందనీయమన్నారు. ఇందులో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డివైఎస్ఓ పవన్ కుమార్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సురేష్ కుమార్, ఎన్ఐసీ అధికారి మధు, ఈ-డీఎం కార్తీక్, వంశీధర్ రెడ్డి, టాస్క్ అధికారులు, ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎంపీ కడియం కావ్య

- **రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ అమలు చేసిన ప్రభుత్వం**
- **రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళా**

**హనుమకొండ (తెలంగాణ వాణి టౌన్)**

హనుమకొండ జిల్లా సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వేదికగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి మెగా రైతు మేళా ముగింపు వేడుకలకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య హాజరయ్యారు.అంతకుముందు హనుమకొండ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌కు చేరుకున్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకి వరంగల్ ఎంపీ కడియం కావ్య పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం మెగా రైతు మేళాలో ఏర్పాటు చేసిన వివిధ వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, సాంకేతిక స్టాళ్లను సందర్శించి రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికతలు, పథకాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య మాట్లాడుతూ రాత్రింబవళు కష్టపడి చెమటోడ్చి భూమిలో విత్తనాలు నాటి, వాటిని పంటలుగా మార్చి దేశానికి అన్నం పెడుతున్న గొప్ప వ్యక్తి రైతన్న అని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అన్నారు. రైతు కష్టానికి గౌరవం ఇచ్చే ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని



ప్రభుత్వం రూ.21 వేల కోట్ల రైతు రుణమాఫీ అమలు చేసి రైతులకు ఊరటనిచ్చిందన్నారు. రైతు బీమా, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా వంటి అనేక సంక్షేమ పథకాలను రైతులకు అందిస్తూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు.రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, ఇందుకోసం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మద్దతుగా నిలుస్తోందన్నారు. వ్యవసాయ పనిముట్లపై 50 శాతం సబ్సిడీ అందిస్తూ రైతుల భారం తగ్గిస్తున్నామని తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేస్తోందని, మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ వారిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తోందన్నారు. రాష్ట్ర స్థాయి రైతు ప్రణాళికలో భాగంగా ఆయిల్ ఫామ్ సాగుకు బ్యాంకుల ద్వారా దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నామని తెలిపారు. రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించేందుకే ఇలాంటి మెగా రైతు మేళాలు నిర్వహిస్తున్నామని, వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక రంగాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను గమనించి రైతులు పంటల మార్పిడి విధానాలను అనుసరించాలని కోరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలపై విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలకు ప్రజలు నిజం తెలుసుకోవాలని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర మంత్రులను పదేపదే కలిసి ప్రత్యేక నిధులు తీసుకువస్తూ తెలంగాణకు మేలు చేస్తున్నారని పేర్కొన్నారు. నిలిచిపోయిన స్టార్టప్ సెంటర్లకు పునర్జీవం పోసి, కేంద్రం నుంచి వేల కోట్ల నిధులు వచ్చేలా కృషి చేస్తున్నారని తెలిపారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వయంగా రైతుల మధ్యకు వచ్చి అవగాహన కల్పించడం అభినందనీయమని, దీని ద్వారా రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని అన్నారు.గత ప్రభుత్వ హయాంలో లక్ష రూపాయల రుణమాఫీ కూడా పూర్తిగా అమలు చేయలేదని, ఇప్పుడు రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటని ప్రతిపక్షాలపై ఎంపీ మండిపడ్డారు. రైతుల పక్షాన నిలబడి వారి సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కె ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు, వివిధ కార్పొరేషన్ చైర్మన్ లు, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, అధికారులు, పెద్ద ఎత్తున రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వరదల సమయంలో సమర్థవంతమైన స్పందనకు అన్ని శాఖల సమన్వయం అవసరం

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

**నిర్మల్, మే:07(తెలంగాణ వాణి ప్రతినిధి)**

రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరదల నివారణ, విపత్తు నిర్వహణ చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ అధికారులు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఎస్పీ జానకి షర్మిలతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో వర్షాకాలానికి ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలు, వరదల సమయంలో తక్షణ స్పందన, ప్రజల రక్షణ, సహాయక చర్యలు, అత్యవసర సేవల సమన్వయంపై విస్తృతంగా సమీక్షించారు. జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న గ్రామాలు, చెరువులు, వాగులు, కాలువలు, రహదారుల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



వర్షాకాల సన్నద్ధతలో భాగంగా నిర్మల్ జిల్లాలో జిల్లా స్థాయి ఫ్లడ్ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ మాక్ ఎక్సర్‌సైజ్ ద్వారా వరదల సమయంలో తీసుకోవాల్సిన అత్యవసర చర్యలను ప్రాయోగికంగా అమలు చేసి శాఖల మధ్య సమన్వయాన్ని పరీక్షించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మున్సిపల్ పరిపాలన, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా శాఖలతో పాటు ఇతర అత్యవసర సేవల విభాగాలు పాల్గొంటాయని తెలిపారు. ప్రజల తరలింపు ప్రక్రియ, సహాయక శిబిరాల ఏర్పాటు, రక్షణ చర్యలు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందన విధానాలను సమగ్రంగా పరిశీలించనున్నట్లు వెల్లడించారు. అలాగే విపత్తుల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అవసరమైన యంత్రాంగం, సిబ్బంది, పరికరాలను సిద్ధంగా ఉంచాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు అందించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు బి వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, సబ్ కలెక్టర్ సంకేత్ కుమార్, ఆర్ డి ఓ రత్న కళ్యాణి, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి బ్యూరో (తెలంగాణ వాణి)**

గురువారం ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎంల భద్రతా ఏర్పాట్లపై ప్రతి నెలా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే గురువారం గోడౌన్‌ను పరిశీలించినట్లు తెలిపారు. తనిఖీలో భాగంగా సీసీ కెమెరాల నియంత్రణ గదిని సందర్శించి, కెమెరాల పనితీరు, రికార్డింగ్ వ్యవస్థలను పరిశీలించారు. గోడౌన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. అనుమతి లేని వ్యక్తులను గోడౌన్ పరిసరాల్లోకి అనుమతించరాదని భద్రతా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లను పరిశీలించి సంతకం చేశారు. ఈ తనిఖీలో కొత్తగూడెం ఆర్ డి ఓ మధు, ఎన్నికల సూపరింటెండెంట్ రంగప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, సంబంధిత అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.





## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి

**కరీంనగర్:మే 07(తెలంగాణ వాణి)**

కరీంనగర్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాశీను గురువారం అదనపు కలెక్టర్ రెవెన్యూ డి.శ్రీనివాస్ రెడ్డి రాజకీయ పార్టీ ప్రతినిధిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవెన్యూ డి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గనిర్ధేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవిఎం, వివిప్యాట్ గోదాంను తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. ఈవిఎం ల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్ల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోదాశీ వద్ద సిబ్బంది హాజరు తీరుపై ఆరా తీశారు. ఈవిఎం గోదాం వద్ద విధులు నిర్వహి స్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవియం గదుల వి వి ప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షిం చారు. ఈ కార్యక్రమంలొ ఏ.వో సుధాకర్,తహసిల్దార్ నరేందర్,బిఆర్ ఎస్ పార్టీ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్ , ఎంఐఎం పార్టీ ప్రతినిది మహ్మద్ మజీద్ హుమైన్, సయ్యద్ ఇబ్రహీం,టిడిపి పార్టీ ప్రతినిది ఎర్రవెల్లి వినీత్,సి పి యం పార్టీ ప్రతినిధి నరేష్ ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## కొండగట్టులో హనుమాన్ పెద్ద జయంతి వేడుకలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

**అదనపు ఎస్పీ చేతన్ నితిన్**

**భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి**



**జగిత్యాల: మే 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టులో ఈ నెల 10 నుండి 13 వరకు నిర్వహించనున్న హనుమాన్ పెద్ద జయంతి మహోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా అదనపు ఎస్పీ శ్రీ చేతన్ నితిన్ ఐపీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జయంతి వేడుకల సందర్భంగా వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చే అవకాశం ఉన్నందున, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆలయ పరిసర ప్రాంతాలు, క్యూలైన్లు, మాలవిరమణ ప్రాంతాలు, పార్కింగ్ ప్రదేశాలు, వాహనాల రాకపోకలు జరిగే మార్గాలు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు పలు సూచనలు చేశారు.అదేవిధంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, భక్తుల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని పేర్కొన్నారు. ఎలాంటి నేరాలకు తావులేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ భద్రతా ఏర్పాట్ల పరిశీలనలో అదనపు ఎస్పీ తో పాటు డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, ఎస్ బి ఇన్స్పెక్టర్ ఆరిఫ్ అలీ ఖాన్, సీఐలు రవి, సుధకర్,కరుణాకర్, ఎస్. ఐ నరేష్ పాల్గొన్నారు.

## ఉచిత కోచింగ్ కు దరఖాస్తులు ఆహ్వానం

**జగిత్యాల: మే 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



మైనారిటీ సంక్షేమ శాఖ నియంత్రణలో పని చేస్తున్న తెలంగాణ స్టేట్ మైనారిటీ స్టడీ సర్కిల్, హైదరాబాద్, 2026-27 విద్యా సంవత్సరంలో మైనారిటీ విద్యార్థులకు యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ -2027 కోసం ఉచిత కోచింగ్ ను నిర్వహిస్తోందని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి అశోక్ తెలిపారు. మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, శారీరక వికలాంగ విద్యార్థులకు 5 శాతం రిజర్వేషన్ల నిబంధన అనుసరించబడిందన్నారు. 7 నుండి ఆన్ లైన్ దరఖాస్తు ప్రారంభం అవుతుండగా, దరఖాస్తుల స్వీకరణకు 31-05-2026 చివరి తేదీ అని తెలిపారు. స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహణ 14.06.2026 హైదరాబాద్ లోని తెలంగాణ స్టేట్ మైనారిటీస్ స్టడీ సర్కిల్లో మొదటిసారి ప్రవేశం పొందేందుకు అర్హత కలిగిన మైనారిటీ అభ్యర్థులందరూ స్క్రీనింగ్ టెస్ట్ కు హాజరు కావాలని, ప్రవేశం మెరిట్ ఆధారంగా ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు/సంరక్షకుల వార్షిక ఆదాయం సంవత్సరానికి రూ.05.00 లక్షలకు మించకూడదన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన మైనారిటీ కమ్యూనిటీల (అంటే ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్, బౌద్ధ, పార్సీ) జనరల్ / ప్రొఫెషనల్ డిగ్రీ అభ్యర్థుల నుండి **https://cet.cgg.gov.in/tmreis** వెబ్సైట్లో ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. యూపీఎస్సీ సి ఎస్ ఏ టి -2025 సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ లో ప్రవేశానికి, అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాలలో ఉన్న తెలంగాణ మైనారిటీల రెసిడెన్షియల్ పాఠశాలల్లో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. వివరణాత్మక నోటిఫికేషన్ వెబ్సైట్ **https://cet.cgg.gov.in/tmreis** లో అందుబాటులో ఉంది. **e-Mail ID:directormscccctelangna@gmail.coms** సంప్రదించండి అన్ని పని దినాలలో ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.00 వరకు సంప్రదించవచ్చని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి అశోక్ తెలిపారు.



ధర్మారం మండలం కొత్తూరు గ్రామంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు, గాలివాన బీభత్సానికి గుగులోత్ సంజీవ్ నాయక్కు చెందిన పూరి గుడిసె దెబ్బతింది. గుడిసెపై కప్పిన కవర్లు ఎగిరిపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిరుపేద కుటుంబమైన వీరుఇప్పటికి పూరి గుడిసెలోనే నివాసం ఉంటూ గుడిసెపై కవర్లు కప్పుకొని జీవనం కొసాగిస్తున్నారు. తీవ్రమైన గాలివానతో కూడిన వర్షం పడినప్పుడల్లా ఈ కుటుంబం బిక్కుబిక్కుమంటూ జీవించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఇంటి స్థలం తప్ప గుంట భూమి కూడా లేదు అధికారులు నాయకులు స్పందించి తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని బాధితుడు సంజీవ్ వేడుకున్నాడు.

ధర్మారం: ఏప్రిల్ 7 (తెలంగాణ వాణి )

# నకిలీ పత్రాల ముఠా గుట్టురట్టు

- **నకిలీ జనన ధృవీకరణ పత్రాలు, ఓటర్ కార్డులు, ఆధార్ కార్డుల మార్పిడి చేస్తున్న ఐదుగురు అరెస్ట్**
- **వివరాలను వెల్లడించిన ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్.**

**ఆదిలాబాద్, మే : 07 ( తెలంగాణ వాణి ప్రతినిధి )**

మావల పోలీస్ స్టేషన్ నందు ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొని నేరస్థుల వివరాలను తెలియజేశారు.

వివరాలలో ఆదిలాబాద్ పట్టణం లోని దస్నాపూర్ రోడ్డులో యూనియన్ బ్యాంక్ సమీపంలో నకిలీ జనన ధృవీకరణ పత్రాలు జారీ చేస్తున్నారనే సమాచారంపై మావల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని, మున్సిపల్ కౌన్సిల్ కమిషనర్ ఎ. జగదీశ్వర్ గౌడ్ ఫిర్యాదు మేరకు విచారణ ప్రారంభించగా, ఒక వ్యక్తి సమర్పించిన జనన ధృవీకరణ పత్రం మున్సిపల్ కార్యాలయ రికార్డుల్లో లేకపోవడంతో మోసం వెలుగులోకి వచ్చింది.

ఈ క్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు మావల ఇన్స్పెక్టర్ కె. స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టి మే 7న ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు.

అరెస్ట్ అయిన నిందితులు :

1. ఒసా రవికుమార్ (విద్యార్థి)



2. షేక్ అమీర్ (నిరుద్యోగి)
3. అబ్దుల్ ముజాహిద్ (కిరాణా దుకాణదారుడు)
4. అబ్దుల్ తన్వీర్ (విద్యార్థి / కంప్యూటర్ వ్యాపారి)
5. అడపా సంతోష్ (మీ సేవా కేంద్రం నిర్వాహకుడు)

మరో నిందితుడు

6. జునైద్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

నిందితులు మొబైల్ ఫోన్లు మరియు పిడిఎఫ్ ఎడిటింగ్ యాప్స్ ఉపయోగించి నకిలీ జనన ధృవీకరణ పత్రాలు, ఓటర్ ఐడీ కార్డులు, ఆధార్ కార్డుల్లో మార్పులు చేసి అమాయక ప్రజలను మోసం చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ప్రభుత్వ పథకాలు పొందేలా చేస్తామని నమ్మబలికి ఒక్కో పత్రానికి రూ.1500 నుండి రూ.3000 వరకు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుండి 280కు పైగా డిజిటల్ పత్రాలు ఉన్న మొబైల్ ఫోన్లు, నకిలీ ఓటర్ కార్డులు, నకిలీ జనన ధృవీకరణ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలకు పలు సూచనలు చేశారు. జనన ధృవీకరణ పత్రాలు వంటి ప్రభుత్వ పత్రాలను కేవలం మున్సిపల్ కార్యాలయం లేదా అధికారిక మీ సేవా కేంద్రాల ద్వారానే పొందాలని సూచించారు. అధిక మొత్తంలో డబ్బులు తీసుకొని త్వరగా పత్రాలు తయారు చేస్తామని చెప్పే వ్యక్తులను నమ్మవద్దని తెలిపారు. నకిలీ పత్రాలను వినియోగించడం కూడా చట్టరీత్యా నేరమని, అటువంటి పత్రాలు భవిష్యత్తులో ధృవీకరణ సమయంలో తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. అనుమానాస్పదంగా పత్రాలు తయారు చేస్తున్న వ్యక్తులపై వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా సమీప ప్రభుత్వ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, మావల ఎస్ హెచ్ ఓ రాహుల్ కాంత్ ఐపిఎస్, సిఐ కర్ర స్వామి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల10న, జరిగే మోదీ భారీ బహిరంగ సభకు తరలిరండి

**బీజేపీ సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్.**

**హుస్నాబాద్ మే 7 (తెలంగాణ వాణి ఆర్ సి)**

హుస్నాబాద్ పట్టణంలోని శిశు మందిర్ పాఠశాలలో బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు అధ్యక్షతన మోదీ బహిరంగ సభ సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్,మోదీ బహిరంగ సభ జిల్లా ప్రభారీ రంజిత్ మోహన్ హాజరై, దిశానిర్దేశం చేశారు. అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి చెందుతుందని, ప్రపంచం లోనే భారత్ ను విశ్వ గురువు స్థానంలో ఉంచడానికి నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 10 వ తేదీన తెలంగాణ రాష్ట్రానికి 7 వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడానికి వస్తున్న శుభ సందర్భంగా భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలోని, నియోజకవర్గ వ్యాప్తంగా భారీ



జనసమీకరణకు పని చేస్తున్నామని, ప్రజలందరూ మోదీ బహిరంగ సభకు తరలిరావాలని పిలుపు నిచ్చారు. ఇటీవల జరిగిన 5 రాష్ట్రాల్లో బీజేపీ 3 రాష్ట్రాల్లో బీజేపీ ప్రభంజనం సృష్టించిందని, బెంగాల్ లాంటి రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ డబుల్ సెంచరీ చేసి, అధికారంలో రావడం గొప్ప మార్పు అని అన్నారు. అంత్యోదయే లక్ష్యంగా దేశంలో రైతులు, యువకులు, పేదవారి అభివృద్ధి ధ్యేయంగా నరేంద్ర మోదీ పనిచేస్తున్నారన్నారు. మూడవ సారి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి సారి నరేంద్ర మోదీ గారు తెలంగాణ రాష్ట్రానికి విచ్చేస్తున్నారని,ప్రజలందరూ ఘనంగా మోదీ కి స్వాగతం పలికేందుకు తరలిరావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, మోదీ బహిరంగ సభ టౌన్ ఇంచార్జ్ కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, సెన్సార్ బోర్డు మెంబర్ లక్కి రెడ్డి తిరుమల, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తోట స్వరూప, పట్టణ ఉపాధ్యక్షులు వేల్పుల నాగార్జున్, బోడిగే వెంకటేష్, కార్యదర్శి అకోజు అరుణ్ కుమార్, కోశాధికారి బుర్ర రాజు, మహిళా నాయకురాలు లకవత్ శారద, గౌరవేని మణేమ్మ, శక్తి కేంద్ర ఇంచార్జ్ నారోజు నరేష్, బీజేపీ సీనియర్ నాయకులు కవ్వ వేణు గోపాల్ రెడ్డి, కాయిత అరుణ్ రెడ్డి, బొనగిరి రవి, తోటసమ్మయ్య,వరియోగుల అనంతస్వామి, కాదాసు నర్సయ్య, అశాడపు శ్రీనివాస్, నాయకులు జేరుపోతుల ఎల్లయ్య, వెల్దండి వెంకటరమణ, ఎర్రబెల్లి ప్రశాంత్, దొంతర బోయినసాంబరాజు,గౌరవేని తిరుపతి, ఎల్కపల్లి నవీన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

**పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర**

**జగిత్యాల: మే 7 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అధికారులకు సూచించారు.రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర గురువారం జగిత్యాల జిల్లాలో పర్యటించారు. 2025-26 యాసంగి (రబీ) సీజన్కు సంబంధించి జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.జిల్లాలోని పూడూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కమిషనర్, రైతులతో నేరుగా మాట్లాడారు. ధాన్యం సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తూకంలో తేడాలు లేకుండా చూడాలని, రైతులకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని ధాన్యం కొనుగోళ్లు వేగవంతం అయ్యేలా, రైతులకు అన్ని రకాల అవగాహనాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.ధాన్యం సేకరణ ప్రక్రియలో జాప్యం జరగకుండా ఉండేందుకు మిల్ ట్యాగింగ్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలను పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలోని నూకపెల్లి గుణ గంగన్ రైస్ మిల్లును సందర్శించి, అక్కడ ధాన్యం నిల్వ సామర్థ్యం, మిల్లింగ్ ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వం



నిర్దేశించిన గడువులోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ అప్పగించాలని మిల్లర్లకు సూచించారు. జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల అధికారులు సమన్వయంతో పనిచేసి, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా తేమ శాతం విషయంలో రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.ఈ పర్యటనలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.జగిత్యాల: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర గురువారం జగిత్యాల జిల్లాలో పర్యటించారు. 2025-26 యాసంగి (రబీ) సీజన్కు సంబంధించి జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.జిల్లాలోని పూడూరు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కమిషనర్, రైతులతో నేరుగా మాట్లాడారు. ధాన్యం సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. తూకంలో తేడాలు లేకుండా చూడాలని, రైతులకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకొని ధాన్యం కొనుగోళ్లు వేగవంతం అయ్యేలా, రైతులకు అన్ని రకాల అవగాహనాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.ధాన్యం సేకరణ ప్రక్రియలో జాప్యం జరగకుండా ఉండేందుకు మిల్ ట్యాగింగ్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలను పర్యవేక్షించాలని సూచించారు. జిల్లాలోని నూకపెల్లి గుణ గంగన్ రైస్ మిల్లును సందర్శించి, అక్కడ ధాన్యం నిల్వ సామర్థ్యం, మిల్లింగ్ ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ అప్పగించాలని మిల్లర్లకు సూచించారు. జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల అధికారులు సమన్వయంతో పనిచేసి, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా తేమ శాతం విషయంలో రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.ఈ పర్యటనలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్ లత, పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కరీంనగర్ ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టే కుట్ర

- **బిజెపి, బీఆర్ఎస్ నాటకాలు ప్రజలు చూస్తున్నారు**
- **మత్తులో కేటీఆర్ ఏదేదో మాట్లాడుతున్నారు**
- **బిఆర్ఎస్, బిజెపి మైత్రి గురించి అందరికి తెలుసు**
- **సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



**కరీంనగర్ (తెలంగాణ వాణి)**

బిజెపి బీఆర్ఎస్ చీకట్లో రహస్య ఒప్పందాలు చేసుకొని ప్రజలను డైవర్ట్ చేస్తున్నారని సుడా చైర్మన్ మండిపడ్డారు. ఇటీవల జరిగిన మేయర్, కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక విషయంలో బిజెపి బీఆర్ఎస్ పరస్పరం సహకరించుకున్నాయని, ఇప్పుడు ఒకరినొకరు తిట్టుకుంటూ పరస్పరం దాడులు చేసుకుంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనను బదనాం చేసేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అడ్డగోలుగా మాట్లాడితే బుద్ధి చెప్తామని, సిగ్గు లేకుండా కేటీఆర్ నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం మారితే కేటీఆర్ తట్టుకోలేకపోతున్నారని ప్రజాపాలనను చూసి ఓర్వలేక పోతున్నారని తాము తలుచుకుంటే కేటీఆర్ ను బయట తిరగనివ్వమని అన్నారు. పథకం ప్రకారమే బిజెపి బీఆర్ఎస్ కలిసి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బదనాం చేసే నాటకాలు ఆడుతున్నాయని, కరీంనగర్లో ప్రశాంత వాతావరణం చెడగొడుతున్నాయని తెలిపారు. బాధ్యత గల పదవుల్లో ఉన్న నేతలంతా డ్రగ్స్ పైన జుట్టు పైన మచ్చలపైన మాట్లాడుకుంటూ పబ్బం గడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు తలుచుకుంటే బిజెపి, బిఆరెస్ నేతల వ్యవహారాలన్నీ బయటపెడతామని అన్నారు. జువెలరీ షాప్ లో జరిగిన రాబరీ విషయంపై పోలీసులు పకడ్బందీగా దర్యాప్తు ప్రారంభించారని, కౌశిక్ రెడ్డి కోడుగుడ్డు మీద ఈకలు పీకటం మానుకోవాలన్నారు. పోలీస్ వ్యవస్థను కించపరిచేలా కౌశిక్ రెడ్డి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దర్యాప్తు విషయాలను బయటకు చెప్తే దొంగలు జాగ్రత్త పడే అవకాశం ఉంది కాబట్టి విచారణ విషయాలను గోప్యత పాటిస్తున్నారని అన్నారు. దొంగలు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు వచ్చింది లాడ్జిలో ఎలా దాక్కున్నది కరీంనగర్ కు ఎలా చేరుకున్నది పోలీసులు బయట పెడితేనే కదా తెలిసింది అంటూ కౌశిక్ రెడ్డిని చైర్మన్ ప్రశ్నించారు. కేటీఆర్ స్నేహితుల ఫామ్ హౌస్లలో డ్రగ్స్ దొరికాయి. ఆ మత్తులో కేటీఆర్ ఏం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు. వెంటనే కుటుంబ సభ్యులు ట్రీట్మెంట్ ఇప్పించాలని అన్నారు. కేటీఆర్ మాటలకు అడ్డు అదుపు లేకుండా పోతుందని, మత్తులో ఏదేదో మాట్లాడుతున్నారని, పదవి అధికారం పోయిన తరువాత ఆక్రోషం ఎక్కువైందని తెలిపారు. వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ డ్రగ్స్ తీసుకుని వ్యాధి ముదిరినట్లు బిహేవ్ చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, కార్పొరేటర్లు మల్లెపల్లి బుచ్చిరెడ్డి, సరిల్ల ప్రసాద్,టేల భూమయ్య, గంటా శ్రీనివాస్,జగన్ రెడ్డి, పర్వతాల మల్లేశం,వారాల నర్సింగం,మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు తాజుద్దీన్,ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్,గుండాటి శ్రీనివాస్ రెడ్డి, ఉప్పరి అజయ్,మాసూమ్ ఖాన్, అష్రఫ్, బషీర్,కలీల్, జమీల్, షహన్షా,ఎండీ అనిఫ్ తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల పట్టణంలో ఆర్టీఏ కార్యాలయశీ నిర్మాణానికి నిధుల మంజూరు చేయండి

**రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు వినతి పత్రం అందజేసిన జువ్వాడి కృష్ణారావు.**



**కోరుట్ల:మే 07(తెలంగాణ వాణి)**
కోరుట్ల పట్టణంలో రోడ్ ట్రాన్స్ పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) ఆఫీస్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ గురువారం రాష్ట్ర రాజ ధాని హైదరాబాద్ సచివాలయంలోని మంత్రి పొన్నం ప్రభాకర్ ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.కోరుట్ల పట్టణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి ఈ కార్యా లయ నిర్మాణం కోసం అందు బాటులో ఉందన్నారు. తక్షణమే నిధులు మంజూరు చేసి (ఆర్టీఏ) కార్యాలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు.నిధుల మంజూరుకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించారని జువ్వాడి కృష్ణారావు పత్రిక విలేకరులకు టెలిఫోన్ ద్వారా తెలిపారు.నిధుల మంజూరు సానుకూలంగా స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలి...

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**రాజన్న సిరిసిల్ల,మే 07 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) :**
జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియను ఎక్కడా జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.గురువారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్దాపూర్ మార్కెట్ కమిటీ ఆవరణలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కేంద్రంలోని ధాన్యం రాశులను పరిశీలించిన కలెక్టర్, కొనుగోలు తీరుపై ఆరా తీశారు.?అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిల్లుల వద్ద ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియలో ఆలస్యం జరగకుండా ఉండేందుకు మిల్లర్లు హమాలీల సంఖ్యను పెంచుకోవాలని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద వేచి ఉండాల్సిన అవసరం లేకుండా, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు పారదర్శకతతో కొనుగోళ్లు సాగాలని పేర్కొన్నారు. ?ఈ తనిఖీ కార్యక్రమంలో కలెక్టరుతో పాటు ఆర్డీఓ వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ నరసింహ, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, తహసీల్దార్ జయంత్ కుమార్ మరియు ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## పంట పొలాలలో వీరంగం సృష్టిస్తున్న తాగుబోతులు



**వనపర్తి : మే 7, (తెలంగాణ వాణి ప్రతినిధి ):**
వనపర్తి జిల్లా వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామంలో పంట పొలాలలో తాగుబోతులు వీరంగం సృష్టిస్తున్నారు. దీంతో రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. తాగుబోతులు పొలాల్లోకి ప్రవేశించి, పైపులు పగలగొట్టడం, సీసాలు పగలగొట్టడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. రైతులు పొలం పనుల కోసం రాత్రిపూట లేదా తెల్లవారుజామున వెళ్లినప్పుడు ఇటువంటి సంఘటనలు రైతులకు భయాన్ని కలిగిస్తున్నాయి. పొలం గట్లపై, నిర్మానుష్య ప్రాంతాల్లో మద్యం సేవించడం, ఆ తర్వాత హంగామా చేయడం వంటివి జరుగుతున్నాయి. దీంతో పొలానికి వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లోని ప్రజలు, రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయడం, రాత్రి నిఘా (పహారా) ఏర్పాటు చేసుకోవడం వంటి చర్యలు తీసుకోవడంతో ఇలాంటి చర్యలను కొద్దివరకు నివారించవచ్చు అని రైతుల అభిప్రాయపడుతున్నారు .

## పీఎం కుసుమ్ మోడల్ విలేజ్ పథకం కింద సౌర విద్యుత్ వినియోగంపై దిశానిర్దేశం



**చర్ల (తెలంగాణ వాణి)**
చర్ల మండల రైతు వేదికలో బుధవారం 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక రైతు వారం' కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో "వ్యవసాయ క్షేత్రాలు – విద్యుత్ కేంద్రాలు" అనే అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా పీఎం కుసుమ్ మోడల్ విలేజ్ పథకం కింద సౌర విద్యుత్ వినియోగంపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఏఈ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతులు సోలార్ పంపుసెట్లను వినియోగించుకోవడం ద్వారా విద్యుత్ ఖర్చులు తగ్గడంతో పాటు నిరంతర సాగునీరు అందుబాటులో ఉంటుందని తెలిపారు. భవిష్యత్తులో వ్యవసాయం పూర్తిగా సౌరశక్తిపై ఆధారపడే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల బుచ్చిబాబు మాట్లాడుతూ వ్యవసాయ రంగంతో పాటు ప్రతి ఇంటికీ సోలార్ అవసరమని అభిప్రాయపడ్డారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు మిడిసిలేరు గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పరుచూరి రవి, ఎండీవో ఈదయ్య, వ్యవసాయ అధికారి లావణ్య, రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణి ఆర్థిక లోటు భర్తీ ఎప్పుడు ?

- ప్రభుత్వం 53 వేల కోట్ల బకాయిలను చెల్లించేనా ?
- సింగరేణి సంస్థకు పూర్వ వైభవం వచ్చేనా!
- గుర్తింపు సంఘాల స్వార్థ రాజకీయాలకు సింగరేణియుల భవిష్యత్ సమాధి కానుందా ?
- సింగరేణిలో మళ్ళీ "గోల్డెన్ షేక్ హ్యాండ్" స్కిం !!!
- ఇద్దరు ఐఏఎస్ అధికారులు సంస్థను గాడిలో పెడతారా ?
- సమాధానం లేని ప్రశ్నలకు కేంద్రంగా మారుతున్న సింగరేణి సంస్థ





**కొత్తగూడెం సింగరేణ (తెలంగాణ వాణి)**
ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణికి పూర్వ వైభవం వచ్చే అవకాశం ఉందా లేదా అన్న ప్రశ్నలు సర్వత్ర తలెత్తుతున్నాయి. మంచి లాభాల్లో ఉన్న సింగరేణి సంస్థ ఆర్థిక నష్టాలతో కు కొట్టుమిట్టాడుతోందన్న సమాచారం సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మిక కుటుంబాల్లో ఆందోళన కలిగిస్తుంది. సింగరేణిలో పనిచేసే ఉద్యోగులకు కార్మికులకు ప్రతినెల జీతాలు కూడ సక్రమంగా చెల్లించలేని పరిస్థితిలో ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సింగరేణిలోని గుర్తింపు సంఘాల ముప్పేట రాజకీయ జోక్యం చేసుకోవడం వల్లనే ఈ దుస్థితి ఏర్పడిందని బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న విద్యుత్ సంస్థలు సింగరేణి చెల్లించాల్సిన సుమారు రూ. 53 వేల కోట్లు ఎప్పుడు వస్తాయో అర్థం కాక సంస్థ ఉన్నతాధికారులు తలలు పట్టుకుంటున్నట్టు తెలుస్తుంది. తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న సింగరేణి రాజకీయ జోక్యం కారణంగానే ఆర్థిక నష్టాలకు లోనవుతుందని కార్మికులు వ్యాఖ్యానిస్తున్నారు. సంస్థకు రక్షణగా ఉండాల్సిన కార్మిక సంఘాల నాయకులు మాత్రం తనకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటియుసి అనుబంధ సంస్థ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ప్రాంతీయ గుర్తింపు సంఘం గా ఉన్న ఐఎన్టియుసి అనుబంధంగా ఉన్న సింగరేణి కాలనీ లేబర్ యూనియన్ నాయకులు మౌనం వహించడమే సంస్థ నష్టాలకు కారణమని ఇతర కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

**సంస్థలో వారసత్వ ఉద్యోగాలు ఇక లేనట్లేనా?.**

గత కొన్నేళ్ళు గా సింగరేణి సంస్థలో కొనసాగుతువస్తున్న వారసత్వ ఉద్యోగాల పరంపర ఇక లేనట్లేనని కార్మిక వర్గం బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. సింగరేణి యాజమాన్యం గతంలో అనుసరించిన విధానాలతొ పాటు మితిమీరిన రాజకీయ జోక్యం వల్లనే సంస్థ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయిందని బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సింగరేణి సంస్థ మకుటం లేని మహారాజు లాగా ఎదుగుతుందనుకున్నా తెలంగాణ వాదుల ఆలోచన విధానాలకు విరుద్ధంగా జరగడంతో ప్రతి ఒక్కరూ తలలు పట్టుకుంటున్నారు. వారసత్వ ఉద్యోగాల పేరుతో కార్మిక సంఘాల నాయకులతోపాటు రాజకీయ నాయకులకు అంటగాగిన చోటామోటా నాయకులు, పైర్వీకారులు లక్షల రూపాయలు దండుకున్నారన్న విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారులు ఉంటే ఆ ప్రభుత్వానికి అంట కాగుతున్న అధికారిని మాత్రమే సి అండ్ ఎండిగా నియమించుకుంటున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం రాష్ట్ర ప్రభుత్వానికి 51శాతం సింగరేణిలో ఉండటం వల్లనే సంస్థ పరిశీలనను రాష్ట్ర ప్రభుత్వమే కొనసాగిస్తూ వచ్చింది. సంస్థ అభివృద్ధిపై పరిశీలించాల్సిన కేంద్ర ప్రభుత్వం తనకేమీ పట్టనట్లుగానే వ్యవహరిస్తుందని విమర్శలున్నాయి. దీనివల్ల సంస్థ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవటం వల్లనే సంస్థలో సంస్కరణలను ప్రారంభించడం జరుగుతోందని తెలుస్తోంది. వారసత్వ ఉద్యోగాల విధానాన్ని తొలగిస్తున్నట్లు యాజమాన్యం బహిరంగంగా ప్రకటించకుండానే అందుకు అనుగుణంగా వ్యవహరిస్తుందని తెలుస్తోంది. ఈ క్రమంలోనే గతంలో "గోల్డెన్ షేక్ హ్యాండ్ " స్కీమును సింగరేణిలో ప్రవేశ పెట్టడం జరుగుతుందని యాజమాన్యం ఇటీవల సర్కులర్ కూడా జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ విధానానికి కార్మిక వర్గం కూడా సిద్ధమైందని



తెలుస్తోంది.

**పెండింగ్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించేనా!**

సింగరేణి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోని జెన్కో, ట్రాన్స్కో సంస్థలు చెల్లించాల్సిన సుమారు 53వేల కోట్లు బకాయిలు రాబట్టేందుకు ఐదు జాతీయ కార్మిక సంఘాలతో పాటు విప్లవ కార్మిక సంఘాలు సైతం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఇటీవల సిఐటియు అనుబంధంగా ఉన్న సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్మికులు హైదరాబాదులోని విద్యుత్ సౌధ ప్రధాన కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించి సంచలనం సృష్టించడం జరిగింది. అయినా ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సిఐటియు నాయకులతొ చర్చించటమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమ సంస్థకు డబ్బు రాగానే చెల్లిస్తామని నచ్చజెప్పి పంపించడం గమనార్హం.

**సింగరేణిలో సమ్మె తప్పదా ?**

ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మాత్రం సమ్మె చేస్తామంటూ హెచ్చరికలు గజారీ చేస్తున్నారు. మరోవైపు గత కొన్నేళ్లుగా పెండింగ్ లో ఉన్న సమస్యలు కార్మికుల సొంత ఇంటి కల, పేర్లు మార్పిడి, పెర్క్స్ వంటి వాటిని తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేయటం జరుగుతుంది. అలాగే బిఎంఎస్ అనుబంధ సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ పెండింగ్ బకాయిలు రాబట్టాలని, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, 12వ వేతన ఒప్పంద కమిటీ నియమించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా హెచ్ఎంఎస్ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి రియాజ్ హమ్మద్ మాత్రం అన్ని కార్మిక సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఏది ఏమైనా సింగరేణి సంస్థకు ప్రస్తుతం ఉన్న ఇద్దరు ఐఏఎస్ అధికారులు సంస్థ మనుగడ కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తాయో... లేదో... వేచి చూడాల్సిందే.

# అవయవ లోపం బలహీనత కాదు

- మనోధైర్యంతో చరిత్ర సృష్టించండి
- దివ్యాంగుల సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉంది
- బడ్జెట్‌లో దివ్యాంగులకు పెద్దపీట రూ.1600 కోట్లు కేటాయింపు
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**రాజన్న సిరిసిల్ల,మే 07 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి) :**
అవయవ లోపం శరీరానికే తప్ప సంకల్పానికి కాదని, మనోధైర్యంతో ముందడుగు వేస్తే వైకల్యాన్ని జయించి చరిత్ర సృష్టించవచ్చని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల సహాయక ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సినారే కళామందిరంలో గురువారం నిర్వహించగా, ముఖ్య అతిథులుగా కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిల్స్, సుగమ్య కేన్, స్మార్ట్ ఫోన్, ఇతర పరికరాలు అందజేశారు.?ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ శరీర అవయవాలు సరిగ్గా లేకపోయినా మనోధైర్యంతో చరిత్ర సృష్టించిన మహనీయులు ఎందరో ఉన్నారని అన్నారు. కంటి చూపు లేకపోయినా కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన దివ్యాంగులు మనకు స్ఫూర్తిప్రదాతలని పేర్కొన్నారు. మనిషి కేవలం శరీరంతోనే కాకుండా, అంతకు మించి మనసుతోనూ, ఆత్మవిశ్వాసంతోనూ విజేతగా నిలవగలడని ఆశాభావం వ్యక్తం చేశారు. ఓటమి అనేది శరీరానికి కాదు, మనసుకు కలిగినప్పుడే మనిషి కుంగిపోతాడని, తనపై తనకు నమ్మకం ఉన్న రోజున జీవితం కొత్త మలుపు తిరుగుతుందని అన్నారు.దివ్యాంగుల సంక్షేమం కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందని, గత యూపీఏ ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుతం మూడు రెట్లు అధికంగా బడ్జెట్ కేటాయిస్తున్నామని, ఈ ఏడాది కేవలం దివ్యాంగుల కోసమే రూ.1600 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఏడీఐపీ, అలీం కో వంటి పథకాల ద్వారా కేవలం పరికరాలు అందించడమే కాకుండా విద్య, ఉపాధి, డిజిటల్ ఐడీ, యాక్సెసిబుల్ ఇండియా మౌలిక సదుపాయాల కల్పనలో కేంద్రం ముందుందని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోనే ఇప్పటివరకు దివ్యాంగుల కోసం రూ.100 కోట్లకు పైగా వెచ్చించినమని అన్నారు.?మహిళలు, వృద్ధులు మరియు చిన్నారుల సంక్షేమం కోసం కూడా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే బాలామృతం,గుడ్లు, పాలు వంటి పౌష్టికాహారానికి కేంద్రమే నిధులు సమకూరుస్తోందని, తద్వారా గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సిరిసిల్లలో ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి త్వరలోనే సహాయం అందజేస్తామని హామీ ఇచ్చారు.కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన శిబిరాల ద్వారా పంపిణీ చేసే ఉపకరణాలను సద్వినియోగం చేసుకుని, దివ్యాంగులు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. 'సుగమ్య భారత్ – స్వశక్త భారత్' లక్ష్యంలో భాగంగా దేశ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని అన్నారు. జిల్లాలోని ఆరు శిబిరాల ద్వారా అర్హులను గుర్తించి ఈ సహాయక పరికరాలను అందజేస్తున్నామని, ఇవి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని అన్నారు.?ఉపాధి కల్పనలో భాగంగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెట్రోల్ బంక్‌లో 10 మందికి అవకాశం కల్పించామని తెలిపారు. అలాగే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని యూడీఐడీ కేంద్రంలో అన్ని వసతులు కల్పించామని, ప్రతి నెల వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. దివ్యాంగులు ఈ సౌకర్యాలను వాడుకొని స్వశక్తితో ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్పీ మహేష్ బి. గితే,మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారాణి,ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ఐఓసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ వినీత్ కౌల్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ సీఎస్ ఆర్ హెడ్ హైదరాబాద్ కైలాస్ కాంత్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, జడ్పీ సీఈవో వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 4రోజుల సమ్మెతో 1 కోటి 33లక్షల పై చిలుకు పిఎఫ్ ఈఎస్ఐ డబ్బులు జమచేసిన మున్సిపల్

**స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకుని విధుల్లో చేరిన కార్మికులు**

**జహీరాబాద్/టౌన్: మే 07(తెలంగాణ వాణి ప్రతినిధి)**
జహీరాబాద్ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్ లో ఉన్న పీఎఫ్ ఈఎస్ఐ సమస్య పరిష్కరించాలని జమచేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా సమ్మె నిర్వహించి విజయం సాధించడం జరిగింది. పెండింగ్లో ఉన్న పీఎఫ్ ఈఎస్ఐ ని సుమారు ఒక కోటి 33 లక్షల పైచిలుకు డబ్బులను మున్సిపల్ నుండి జమ చేసిన సందర్భంగా సమ్మెను విరమించి కార్మికులు విధుల్లో చేరడం జరిగింది ఈ సందర్భంగా ఉదయం అటెండెన్స్ పాయింట్ వద్ద కార్మికులు మిఠాయిలు పంచుకునీ సంబరాలు నిర్వహించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై సిఐటియు నిరంతరం ఆందోళన పోరాటాలు నిర్వహిస్తుందని ఆందోళన ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని అందులో భాగంగానే ఈఎస్ఐ పిఎఫ్ జమ చేయాలని సమ్మె నిర్వహించడం జరిగిందని భవిష్యత్తులో ఇలా పెండింగ్ ఉండకుండా వెంట వెంటనే చెల్లించాలని కోరారు. పెండింగ్ పీఎఫ్ ఈఎస్ఐ జమ చేసిన మున్సిపల్ కౌన్సిల్ కు అధికారులకు సిఐటియు తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని, ఐక్యంగా పోరాడిన కార్మికులకు అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు. సమస్యల



పరిష్కారానికి భవిష్యత్తులోనూ ఉద్యమాలు పోరాటాలు నిర్వహించాలని ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సంజీవ్ మోహన్ యశోదమ్మ సిద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## మహీంద్రా రూ.33 డివిడెండ్




**న్యూఢిల్లీ :** దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.5,259.91 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.3,541.85 కోట్ల లాభంతో పోలిస్తే 48.5 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.42,585.67 కోట్ల నుంచి రూ.54,891.55 కోట్లకు ఎగబాకినట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది. మరోవైపు, 2025–26 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1,97,792.78 కోట్ల ఆదాయంపై రూ.18,621.71 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. కంపెనీ బోర్డు సమావేశమై రూ.5 ముఖ విలువ కలిగిన ప్రతిషేరుకూ రూ.33 తుది డివిడెండ్‌ను ప్రకటించింది.

## స్టార్ హెల్త్ 1,254 కోట్ల క్లెయిం సెటిల్‌మెంట్



**హైదరాబాద్ :** గడిచిన ఆర్థిక సంవత్సరంలో తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో రూ.1,254 కోట్ల విలువైన 1.8 లక్షల పాలసీలు క్లెయిం చేశామని స్టార్ హెల్త్ ఎండీ, సీఈవో ఆనంద్ రాయ్ తెలిపారు. అంతక్రితం ఏడాది చేసిన రూ.1,014 కోట్ల కంటే ఇది 24 శాతం అధికమని పేర్కొన్నారు. కంపెనీ మొత్తం వ్యాపారంలో తెలుగు రాష్ట్రాల వాటా 10 శాతంగా ఉండగా, వచ్చే మూడు నుంచి నాలుగేండ్లలో ఇది 12 శాతం నుంచి 15 శాతానికి పెరుగనున్నదని ఆశిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా రూ.24 వేల కోట్ల ప్రీమియం వసూళ్లు లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ఇప్పటికే సంస్థ 35 హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లను విక్రయిస్తున్నది.

# వృద్ధిరేటుకు గల్ఫ్ దెబ్బ!




సమర్‌కండ్ (ఉజ్బెకిస్థాన్)/న్యూఢిల్లీ, మే 5: అమెరికా, ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం.. భారత జీడీపీ వృద్ధికి అడ్డుపడుతున్నది. ఇప్పటికే ఈ మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతల వల్ల దేశంలో ఇంధన సమస్యలు తలెత్తిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఇప్పుడు ఆర్థిక వృద్ధికి సైతం ఇబ్బందులు తప్పవన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే భారత జీడీపీ అంచనాలకు తాజాగా ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడీబీ) కోతలు పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026–27) 6.3 శాతానికే పరిమితం కావచ్చని ఏడీబీ వార్షిక సమావేశం సందర్భంగా దాని ప్రధాన ఆర్థికవేత్త ఆల్బర్ట్ పార్క్ మంగళవారం ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అన్నారు. గత నెలలో 6.9 శాతంగా ఉండొచ్చనగా.. ఇప్పుడు అందులో 0.6 శాతం తగ్గించారు. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరం (2027–28) 7.3 శాతం జీడీపీ నమోదు కావచ్చని ఏప్రిల్‌లో ఏడీబీ చెప్పింది. అయితే తాజా అంచనాలతో ఇది కూడా తగ్గిపోయే అవకాశాలే కనిపిస్తున్నాయి. దేశీయంగా ఉండే బలమైన డిమాండ్‌ను పెరుగుతున్న ద్రవ్యోల్బణం దెబ్బతీస్తుండటమే.. వృద్ధి అంచనాల తగ్గుదలకు కారణమన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

### వార్ ఎఫెక్ట్ ఇలా..

ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం మొదలైంది. అంతకుముందు బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ ధర 70 డాలర్లే. కానీ ఇప్పుడు 40 డాలర్ల మేర పెరిగింది. ప్రస్తుతం 110 డాలర్ల వద్ద కదలాడుతున్నది. అమెరికా క్రూడ్ బెంచ్‌మార్క్ సైతం బ్యారెల్ 100 డాలర్లకుపైగా సూచిస్తున్నది. దీంతో మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు కొనసాగితే.. ముడి చమురు రేట్లు మరింతగా విజృంభించడం ఖాయమే. ఇక పెరుగుతున్న ముడి చమురు ధరలు.. అనుబంధ రంగాలనూ దెబ్బతీస్తున్నాయి. యుద్ధం మొదలై 2 నెలలు దాటిపోవడంతో ఇప్పటికే రిటైల్ మార్కెట్లో ఆయా ఉత్పత్తుల ధరల్ని కంపెనీలు పెంచేశాయి. వివిధ రకాల సబ్బులు, రంగులు, ఎరువుల రేట్లు ప్రత్యక్షంగా.. మిగతా వాటి ధరలు పరోక్షంగా పెరుగడంతో వినియోగదారులపై ఆ భారం పడుతున్నది. దేశీయ ఇంధన అవసరాలు దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఇందులో మెజారిటీ వాటా సౌదీ అరేబియా, కువైట్, ఖతార్ తదితర గల్ఫ్ దేశాలదే. రష్యా నుంచి కూడా పెద్ద ఎత్తునే కొంటుండగా.. అమెరికా ఆంక్షలు అందుకు అడ్డుతగులుతున్నాయి.

ఈ క్రమంలో అమెరికా, ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం.. మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి వచ్చే ముడి చమురుకు బ్రేకులు వేసింది. అమెరికాకు అండగా నిలుస్తున్నాయని పొరుగు దేశాలపై ఇరాన్ గురి పెడుతున్నది. యూఏఈ, బహ్రెయిన్, కువైట్, ఖతార్ దేశాల్లోని చమురు, గ్యాస్ ఉత్పాదక కేంద్రాలే లక్ష్యంగా దాడులు చేస్తున్నది. ముఖ్యంగా హెర్మూజ్ జలసంధిలో రవాణా ఆగిపోయింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌తో అమెరికా చర్చలు కొంత ఊరటనిచ్చినా.. ఆయా అంశాల్లో ఇరు దేశాల పట్టుదల పశ్చిమాసియాలో నెలకొన్న ఈ సంక్షోభం నివారణకు ప్రధాన అడ్డంకిగా మారుతున్నది. ఇది చమురు దిగుమతులపైనే ఆధారపడిన భారత్‌ను కలవరపెడుతున్నదిప్పుడు. అంతర్జాతీయంగా బ్యారెల్ ముడి చమురు ధర 10 డాలర్లు పెరిగితే.. దేశీయంగా దిగుమతి బిల్లు 17–18 బిలియన్ డాలర్లు పెరుగుతుంది మరి. అలాగే కరెంట్ ఖాతా లోటు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ పతనం, ద్రవ్యోల్బణం, ఆర్బీఐ వడ్డీరేట్ల పెంపు, తయారీ మందగమనం, నిరుద్యోగ సమస్యల వల్ల అంతిమంగా దేశ ఆర్థిక వృద్ధిరేటే బలవుతుందని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు.

### సంక్షోభం ముదిరితే అంతే..: సీఐఐ

పశ్చిమాసియాలో సంక్షోభం సుదీర్ఘకాలం సాగితే సరుకు రవాణాపై భారీగా ప్రభావం పడుతుందని, ఇంధన ధరలు పెరుగుతాయని, ఇది భారత్‌కు ఆర్థికపరంగా చాలా ప్రమాదకరమని వ్యాపార, పారిశ్రామిక సంఘం సీఐఐ అధ్యక్షుడు రాజీవ్ మేమాని విశ్లేషించారు. ఈ క్రమంలోనే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతం దిగువకే పరిమితం కావచ్చన్న అంచనాను పీటీఐకిచ్చిన ఇంటర్వ్యూలో వెలిబుచ్చారు. కాగా, దేశంలో వ్యాపార నిర్వహణను సులభతరం చేయాలని, న్యాయపరమైన సంస్కరణలను తేవాలని సూచించారు. ఆర్బీఐ ద్రవ్య విధానంపై మాట్లాడుతూ.. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్‌ఎంఈ)లకు రుణ లభ్యత మరింతగా పెరుగాల్సిన అవసరం ఉందన్నారు. 'ఈ ఆర్థిక సంవత్సరం భారత్‌లో ద్రవ్యోల్బణం 6.9 శాతంగా నమోదు కావచ్చు. దేశ జీడీపీ 0.6 శాతం తగ్గిపోయే వీలున్నది. భారతీయ ఇంధన అవసరాలు దిగుమతుల ద్వారానే ఎక్కువగా తీరుతున్న నేపథ్యంలో మిడిల్ ఈస్ట్ దేశాల్లో యుద్ధం ప్రభావితం చేస్తున్నది మరి. సరఫరా తగ్గితే పెట్రోల్, డీజిల్, గ్యాస్ రేట్లు ఎగబాకడం ఖాయం. ముఖ్యంగా పెరిగే ఎరువుల ధరలు.. రైతుల వినియోగ సామర్థ్యాన్ని తగ్గిస్తాయి. పంట సాగు, దిగుబడులు కూడా పడిపోవచ్చు. ఇదే జరిగితే ఆహార ద్రవ్యోల్బణం విజృంభిస్తుంది. తుదకు అన్ని రంగాలు ప్రభావితమై వృద్ధిరేటు పతనమే.

# టాప్ లేపిన రైజర్స్




సన్‌రైజర్స్ హైదరాబాద్ దుమ్మురేపింది. సొంతగడ్డపై అదిరే బ్యాటింగ్.. సూపర్ బౌలింగ్.. చక్కటి ఫీల్డింగ్‌తో పంజాబ్ కింగ్స్‌పై పంజా విసిరింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. సొంతగడ్డపై నాలుగో విజయం, మొత్తంగా సీజన్‌లో ఏడో గెలుపుతో 14 పాయింట్లు సాధించిన ఆ జట్టు పేఆఫ్స్ బెర్తుకు చేరువైంది. మొదటి ఏడు మ్యాచ్‌ల్లో అజేయంగా నిలిచిన పంజాబ్‌కు వరుసగా ఇది మూడో ఓటమి. ఈ మ్యాచ్ మొత్తంలో కూపర్ కనోలీ సెంచరీ ఒక్కటే పంజాబ్‌కు సానుకూలాంశం.

సొంతగడ్డపై సన్‌రైజర్స్ అదరగొట్టింది. గత మ్యాచ్ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకున్న కమిన్స్ సేన ఆల్‌రౌండ్ ఆటతో సత్తాచాటింది. బుధవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 33 పరుగుల తేడాతో పంజాబ్‌ను ఓడించింది. ఇషాన్ కిషన్ (55; 32 బంతుల్లో 2ఐ4, 4ఐ6), హెన్రిచ్ క్లాసెన్ (69; 43 బంతుల్లో 3ఐ4, 4ఐ6) అర్ధసెంచరీలకు.. అభిషేక్ శర్మ (35; 13 బంతుల్లో 2ఐ4, 4ఐ6), ట్రావిస్ హెడ్ (38; 19 బంతుల్లో 3ఐ4, 3ఐ6), నితీశ్‌కుమార్‌రెడ్డి (29 నాటౌట్; 13 బంతుల్లో 2ఐ4, 2ఐ6) మెరుపులు తోడవడంతో మొదట సన్‌రైజర్స్ 4 వికెట్లకు 235 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం ఆతిథ్య జట్టు బౌలింగ్, ఫీల్డింగ్ ముందు పంజాబ్ తేలిపోయింది. 7 వికెట్లకు 202 పరుగులు చేయగలిగింది. ఒంటరి పోరాటం చేసిన కూపర్ కనోలీ (107 నాటౌట్; 59 బంతుల్లో 7ఐ4, 8ఐ6) శతకంతో అజేయంగా నిలిచాడు.

కనోలీ 107 నాటౌట్; 59 బంతుల్లో 7ఐ4, 8ఐ6

### ఆరంభంలోనే తేలిపోయింది:

ఢిల్లీ క్యాపిటల్స్‌పై 265 పరుగుల లక్ష్యాన్ని 18.5 ఓవర్లలోనే ఛేదించి ఐపీఎల్‌లో చరిత్ర సృష్టించిన పంజాబ్.. స్థాయికి తగ్గ ప్రదర్శన చేస్తే 236 పరుగుల భారీ లక్ష్యం కష్టమేమీ కాదు. అయితే గత రెండు మ్యాచ్‌ల్లో ఓటమితో ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన పంజాబ్.. స్థాయికి తగ్గట్లు ఆడలేకపోయింది. పదునైన బౌలింగ్.. మెరుగైన ఫీల్డింగ్‌తో సన్‌రైజర్స్ తమ ప్రణాళికల్ని పక్కాగా అమలు చేసింది. పంజాబ్ ఫీల్డర్ల మాదిరిగా సన్‌రైజర్స్ మైదానంలో తప్పులు చేయకపోవడంతో ఆ జట్టుకు మొదటి ఓవర్లోనే కష్టాలు మొదలయ్యాయి. తొలి ఓవర్ చివరి బంతికి ప్రియాంశ్ ఆర్య (1).. రెండో ఓవర్ మొదటి డెలివరీకి ప్రభ్‌సిమ్రన్‌సింగ్ (3) పెవిలియన్ బాటపట్టడంతో పంజాబ్ కోలుకోలేకపోయింది. భారీ లక్ష్య ఛేదనలో ఓపెనర్లిద్దరూ మొదటి ఏడు బంతుల్లోనే ఔటవడం పంజాబ్‌ను ఆత్మరక్షణలోకి నెట్టేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (5) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవకపోవడంతో పంజాబ్స్ ఓటమి ఖాయమైపోయింది. కమిన్స్ (2/34), నితీశ్ (1/11), ఇషాన్ మలింగ (1/36) మొదటి నాలుగు ఓవర్లలో 3 వికెట్లు పడగొట్టడంతో మ్యాచ్ సన్‌రైజర్స్ వైపు మొగ్గింది. మార్కస్ స్టొయినిస్ (28; 14 బంతుల్లో 3ఐ4, 2ఐ6) బ్యాట్ ఝుళిపించినా.. అదీ కొద్దిసేపే. అతడిని స్పిన్నర్ శివాంగ్‌కుమార్ (2/45) బోల్తా కొట్టించాడు. అయితే ఓవైపు వికెట్లు పడుతున్నా.. మరో ఎండ్‌లో కనోలీ చెలరేగాడు. సూర్యాంశ్ షెడ్జే (25; 17 బంతుల్లో 1ఐ4, 2ఐ6) అతడికి కాసేపు సహకరించాడు. కానీ షెడ్జే ఔటయ్యాక పంజాబ్ క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. కానీ కనోలీ చివరి వరకు ధాటిని కొనసాగించి సెంచరీ పూర్తి చేశాడు. ఓటమి అంతరాన్నీ తగ్గించాడు.

క్లాసెన్ 69; 43 బంతుల్లో 3ఐ4, 4ఐ6

### సన్‌రైజర్స్ పరుగుల పంట

మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్.. ఉప్పల్‌లో తమకు అచ్చొచ్చిన పిచ్‌పై పరుగుల పంట పండించుకుంది. ఫ్లాట్ పిచ్.. పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో బ్యాటర్లు రెచ్చిపోయారు. పంజాబ్ ఫీల్డర్ల వైఫల్యాలు కూడా తోడవడంతో మరింతగా చెలరేగారు. అర్ష్‌దీప్ ఇన్నింగ్స్ తొలి ఓవర్ రెండో బంతికే సిక్సర్‌తో ఖాతా తెరిచిన అభిషేక్ (35; 13 బంతుల్లో 2ఐ4, 4ఐ6).. యాన్సెన్ బౌలింగ్‌లో విధ్వంసం సృష్టించాడు. రెండు సిక్సర్లు, రెండు ఫోర్లతో 21 పరుగులు పిండుకున్నాడు. అభిషేక్ నుంచి స్ఫూర్తి పొందిన ట్రావిస్ హెడ్ (38; 19 బంతుల్లో 3ఐ4, 3ఐ6) కూడా బ్యాట్‌కు పని చెప్పాడు. అర్ష్‌దీప్ ఓవర్లో రెండు సిక్సర్లు, ఒక బౌండరీతో 16 పరుగులు సాధించాడు. ఫెర్గూసన్ (1/41) బౌలింగ్‌లో భారీషాట్‌కు ప్రయత్నించిన అభిషేక్.. శ్రేయస్ అయ్యర్ చేతికి చిక్కినా, సన్‌రైజర్స్ జోరు ఆగలేదు. పవర్ ప్లేలో 79/1తో పటిష్ఠ స్థితిలో నిలిచిన సన్‌రైజర్స్.. 8.1 ఓవర్లలో 100 పరుగుల మైలురాయిని అందుకుంది. పంజాబ్ చెత్త ఫీల్డింగ్ సన్‌రైజర్స్‌కు బాగా కలిసొచ్చింది. ఇషాన్ మూడుసార్లు (9, 18, 20 వ్యక్తిగత స్కోర్ల వద్ద) ఔటయ్యే ప్రమాదం నుంచి బయటపడ్డాడు. కనోలీ, ఫెర్గూసన్ సులువైన క్యాచ్‌లను నేలపాలు చేయగా.. ప్రభ్‌సిమ్రన్ స్టంపింగ్ అవకాశాన్ని వదిలేశాడు. క్లాసెన్ 9 పరుగుల వద్ద ఉన్నప్పుడు చాహల్ బౌలింగ్‌లో శశాంక్‌సింగ్ సునాయాస క్యాచ్‌ను విడిచిపెట్టాడు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకున్న ఇషాన్, క్లాసెన్ ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఇషాన్ 28 బంతులో.. కాసెన్ 32 డెలివరీలలో అర్ధసెంచరీలు సాధించారు. 17.1 ఓవర్లలోనే సన్‌రైజర్స్ 200 పరుగులకు చేరుకుంది. 250 స్కోరు ఖాయమనుకున్న సమయంలో ఫెర్గూసన్, అర్ష్‌దీప్, వైశాక్ చివరి మూడు ఓవర్లలో కట్టుదిట్టంగా బంతులేయడంతో సన్‌రైజర్స్ అనుకున్న దాని కంటే తక్కువ స్కోరేచేసింది. వైశాక్ చివరి ఓవర్లో ఆఖరి బంతికి ముందు స్టేడియంలో ఒక ఫ్లడ్‌లైట్ నిలిచిపోవడంతో ఆటకు కొద్దిసేపు అంతరాయం కలిగింది. అప్పటికే ఆ ఓవర్లో సిక్సర్, ఫోర్ కొట్టిన క్లాసెన్.. చివరి బంతికి క్యాచౌట్ అయ్యాడు.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) శ్రేయస్ (బి) ఫెర్గూసన్ 35; హెడ్ (సి) యాన్సెన్ (బి) చాహల్ 38; ఇషాన్ (సి) సూర్యాంశ్ (బి) అర్ష్‌దీప్ 55; క్లాసెన్ (సి) యాన్సెన్ (బి) వైశాక్ 69; నితీశ్ 29 నాటౌట్; ఎక్స్‌ట్రాలు 9 మొత్తం: (20 ఓవర్లలో 4 వికెట్లకు) 235; వికెట్ల పతనం: 1-54, 2-84, 3-172, 4-235; బౌలింగ్: అర్ష్‌దీప్ 4-0-43-1; యాన్సెన్ 4-0-61-0; ఫెర్గూసన్ 4-0-41-1; చాహల్ 4-0-32-1; విజయ్‌కుమార్ వైశాక్ 4-0-54-1

పంజాబ్ ఇన్నింగ్స్: ప్రియాంశ్ ఆర్య (సి) మలింగ (బి) కమిన్స్ 1; ప్రభ్‌సిమ్రన్ (సి) కమిన్స్ (బి) నితీశ్‌కుమార్ 3; కనోలీ నాటౌట్ 107; శ్రేయస్ (సి) కమిన్స్ (బి) మలింగ 5; స్టొయినిస్ (సి) ఇషాన్ (బి) శివాంగ్ 28; సూర్యాంశ్ (సి) అభిషేక్ (బి) కమిన్స్ 25; శశాంక్ (సి) నితీశ్ (బి) సకిబ్ 4; యాన్సెన్ (సి) హర్ష్ దూబె (బి) శివాంగ్ 19; వైశాక్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 9; మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 202; వికెట్ల పతనం: 1-4, 2-4, 3-23, 4-63, 5-110, 6-119, 7-187; బౌలింగ్: కమిన్స్ 4-0-34-2; నితీశ్‌కుమార్ 2-0-11-1; మలింగ 4-0-36-1; సకిబ్ 4-0-40-1; శివాంగ్ 4-0-45-2; హర్ష్ దూబె 2-0-36-0

# హీరోల యాటిట్యూడ్‌పై వ్యాఖ్యలు.. అల్లు అర్జున్‌ని కాదంటూ రవిబాబు క్లారిటీ

ఖుజఱ దీుఎబ । తెలుగు చిత్ర పరిశ్రమలో తనదైన శైలితో ప్రత్యేక గుర్తింపు పొందిన దర్శకుడు రవిబాబు మరోసారి వార్తల్లో నిలిచారు. కథ ఏదైనా సరే దానికి వినూత్న ట్రీట్‌మెంట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత. దర్శకుడిగానే కాకుండా నటుడిగా, నిర్మాతగా కూడా తన ముద్ర వేసిన రవిబాబు.. తాజాగా 'రేజర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు.రేజర్ మే 8న విడుదలకు సిద్ధమవుతుండగా, ప్రమోషన్లలో భాగంగా ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీశాయి. గతంలో ఒక ఇంటర్వ్యూలో రవిబాబు మాట్లాడుతూ, "ఒక్క హిట్ వచ్చినా హీరోల బాడీ లాంగ్వేజ్ మారిపోతుంది. కళ్లజోడు పెట్టుకుని బిల్డప్పులు కొడతారు" అని వ్యాఖ్యానించారు. వ్యాఖ్యలు నేరుగా అల్లు అర్జున్‌ని ఉద్దేశించి చేసినవేనని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ముఖ్యంగా పుష్ప 2: ది రూల్తో భారీ క్రేజ్ సంపాదించిన అల్లు అర్జున్ ప్రవర్తనను ఉద్దేశించారని నెటిజన్లు అభిప్రాయపడ్డారు. ఈ వివాదంపై తాజాగా స్పందించిన రవిబాబు, తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని తెలిపారు.నేను సోషల్ మీడియాలో లేను. నేను ఎవరినీ వ్యక్తిగతంగా టార్గెట్ చేయలేదు. బన్నీ నాకు చిన్నప్పటి నుంచి తెలుసు. ఇండస్ట్రీలో సాధారణంగా జరుగుతున్న విషయాలపై మాత్రమే మాట్లాడాను అని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో జరుగుతున్న నెగెటివ్ ప్రచారాన్ని కూడా ఆయన ఖండించారు. అల్లు అర్జున్ 'పుష్ప 2' ప్రమోషన్ల సమయంలో ఆయన ప్రవర్తనపై సోషల్ మీడియాలో పలు చర్చలు జరిగాయి. 'తగ్గేదేలే' అనే పాత్ర యాటిట్యూడ్‌ను బయట కూడా చూపిస్తున్నారని, కొంతమంది అది అహంకారంగా కనిపిస్తోందని విమర్శించారు.ముంబైలో జరిగిన ప్రెస్ మీట్లలో ఆయన బాడీ లాంగ్వేజ్, సమాధానాల తీరు కూడా ట్రోలింగ్‌కు గురైంది. అలాగే ఆయనను కలవాలంటే కఠిన ప్రోటోకాల్ పాటించాలన్న వార్తలు కూడా వైరల్ అయ్యాయి.వివాదాల్ని పక్కనబెడితే, రవిబాబు ప్రస్తుతం రేజర్ ప్రమోషన్లలో బిజీగా ఉన్నారు. ఈ చిత్రం ఒక సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కింది.అడవి నేపథ్యంలో జరిగే ఈ కథలో, మనుషుల కంటే జంతువులే ఎక్కువ వివేకంతో ప్రవర్తిస్తాయనే కాన్సెప్ట్‌ను చూపించనున్నారు. ముఖ్యంగా సినిమాలో కనిపించే కుక్క పాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఈ చిత్రానికి వైదీ సంగీతం అందించగా, 'ఫ్లయింగ్ ఫ్రాగ్స్' బ్యానర్‌పై రవిబాబు స్వయంగా నిర్మించారు. విజువల్ ఎఫెక్ట్స్, సౌండ్ డిజైన్ కూడా హైలైట్‌గా ఉండనున్నాయి.





## మళ్లీ బాలయ్యతో జతకట్టబోతున్న విద్యాబాలన్.. కొరటాల శివ సినిమాలో పవర్‌ఫుల్ రోల్!

నందమూరి బాలకృష్ణ మరియు స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ ఎంటర్టైనర్ చీదీఖ 112 గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో ఒక కీలకమైన మరియు పవర్‌ఫుల్ పాత్ర కోసం బాలీవుడ్ నటి విద్యాబాలన్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. గతంలో 'ఎన్టీఆర్ బయోపిక్' (కథానాయకుడు, మహానాయకుడు) చిత్రాలలో బసవతారకం పాత్రలో బాలయ్య సరసన మెరిసిన విద్యాబాలన్, దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత మళ్లీ ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోబోతుండటం విశేషం. ఈ సినిమాలో మాఫియా నేపథ్యంలో సాగే ఒక హై-వోల్టేజ్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఉంటుందని, అందులో బాలయ్య 'ఊరమాస్' అవతారంలో కనిపిస్తారని సమాచారం. ఆ ఎపిసోడ్‌లో ఆయనకు జోడీగా విద్యాబాలన్ పాత్ర అత్యంత కీలకంగా ఉంటుందని టాక్. యువసుధ ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తుండగా, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్ పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఆగస్టులో షూటింగ్ ప్రారంభించి, 2027 సంక్రాంతి కానుకగా ఈ సినిమాను విడుదల చేసేందుకు చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది.



## సెయాన్' మూవీలో హీరోయిన్‌గా భాగ్యశ్రీ బోర్సే డివైన్ ఫస్ట్ లుక్

వెర్సటైల్ స్టార్ శివకార్తికేయన్, దర్శకుడు శివకుమార్ మురుగేశన్ దర్శకత్వంలో, కమల్ హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మిస్తున్న 'సెయాన్' కోసం చేతులు కలిపారు. బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన అమరన్ తర్వాత శివకార్తికేయన్ మరోసారి రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌తో కొలాబరేట్ కావడం విశేషం. విమర్శకుల ప్రశంసలతో పాటు కమర్షియల్ విజయాన్ని అందుకున్న ఆ చిత్రంతో ఏర్పడిన క్రియేటివ్ జర్నీ ఇప్పుడు మరింత బలపడింది.

గ్రాండ్ రూరల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరోయిన్ గా భాగ్యశ్రీ బోర్సే నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్.. ట్రెడిషన్, డివైన్ వైబ్ మేళవింపుగా ఆకట్టుకుంటోంది. గాజుల షాప్ బ్యాక్‌డ్రాప్‌లో ఆమె కనిపించిన తీరు పాత్రలోని ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తోంది. మురుగన్ స్వామి ప్రతీకను గుర్తు చేస్తూ ఆమె కూర్చున్న తీరు మరింత ఆసక్తిని పెంచింది.

రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్, శివకార్తికేయన్, ప్రముఖ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ కలిసి పనిచేస్తున్న తొలి సినిమా కావడం ఈ ప్రాజెక్ట్‌కు మరో ప్రత్యేకగా నిలిచింది. తన ప్రత్యేకమైన మ్యూజికల్ స్టైల్‌తో, చార్ట్‌బస్టర్ ఆల్బమ్స్‌తో పేరుగాంచిన సంతోష్ నారాయణన్ సంగీతం ఈ చిత్రానికి స్పెషల్ ఎట్రాక్షన్ కానుంది.

రాజ్‌కమల్ ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ లెగసీ, టర్మరిక్ మీడియా విజన్ కలిసిన "సెయాన్" 2026లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాలలో ఒకటిగా నిలవనుంది. తారాగణం: శివకార్తికేయన్, భాగ్యశ్రీ బోర్సే

## 'అమరం' మూవీ ఇంటెన్స్ యాక్షన్ ప్యాక్డ్ టీజర్ రిలీజ్

తేజేష్ రాజన్ హీరోగా పరిచయం అవుతున్న చిత్రం అమరం, తిరుఅరుల్ కృష్ణన్ దర్శకత్వం దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం టీజర్ రిలీజ్ చేశారు. ఇంటెన్స్ యాక్షన్ తో టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ఓ ట్రైబల్ స్మగ్లర్, కిల్లర్, ఓ యువతి ప్రయాణం చుట్టూ తిరిగే కథ ఇది. ఎర్రచందనం స్మగ్లర్ల జీవనశైలి, వారు ఎదుర్కొనే కష్టాలు, ప్రమాదాలు, వారి ప్రపంచంలో దాగి ఉన్న వాస్తవాలను కూడా బలంగా ప్రతిబింబిస్తుంది. ఈస్ట్రన్ ఘాట్స్ నేపథ్యంగా తెరకెక్కిన ఈ సినిమా అక్కడి సామాజిక సమస్యలను కూడా బలంగా ప్రజెంట్ చేస్తోంది.వెస్ట్రన్ ఘాట్స్‌లో కూడా కీలక సన్నివేశాలను చిత్రీకరించగా, కడప పరిసర ప్రాంతాల్లో భారీ సెట్స్ నిర్మించారు. దాదాపు 200 మందికి పైగా పాల్గొన్న ప్రత్యేక యాక్షన్ బ్లాక్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. బాంబేకు చెందిన మార్షల్ ఆర్ట్స్ టీమ్ సహకారంతో మాస్టర్ మిరాకిల్ మైఖేల్ ఆధ్వర్యంలో మూడు భారీ యాక్షన్ బ్లాక్స్ తెరకెక్కించారు. లోతైన ప్రేమకథను సిట్యువేషనల్ యాక్షన్‌తో మేళవించి చిత్రాన్ని రూపొందించారు. తేజేష్ తొలి సినిమాకే అద్భుతమైన యాక్షన్ బ్లాక్స్‌లో నటించి ఆకట్టుకున్నారు. ముఖ్యంగా కొడైకెనాల్‌లోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతం డాల్ఫిన్ నోస్ వద్ద తెరకెక్కించిన ఒక కీలక సన్నివేశాన్ని ఆయన సింగిల్ టేక్‌లో పూర్తి చేయడం విశేషం. హీరోయిన్‌గా ఐరా అగర్వాల్ నటించగా, నాగినీడు, సాయి ధీనా, జార్జ్ మరియన్, సురేష్ చంద్ర మీనన్, హరీష్ పరాడి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన తిరువరుల్ కృష్ణన్ గతంలో నటుడు, దర్శకుడు రాఘవ లారెన్స్ వద్ద అసోసియేట్‌గా పనిచేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ సంగీతం అందించగా, 'వడచెన్నై', 'అసురన్' చిత్రాలకు ఎడిటింగ్ చేసిన రామర్ ఎడిటర్‌గా వ్యవహరించారు. కొత్త సినిమాటోగ్రాఫర్ భరత్ విజువల్స్ అందించారు. ఈ చిత్రంలో ఐదు పాటలు ఉండగా, వాటికి ప్రముఖ కొరియోగ్రాఫర్ బూపతి మాస్టర్ నృత్య దర్శకత్వం వహించారు. ఆయన రాజు సుందరం, ప్రభుదేవా మాస్టర్లకు సన్నిహిత సహాయ కుడిగా మంచి గుర్తింపు పొందారు. కొడైకెనాల్‌లో ఆర్ట్ డైరెక్టర్ జనా సర్ రూపొందించిన భారీ సెట్‌లో ఓ ప్రత్యేక ఫోక్ సాంగ్‌ను చిత్రీకరించారు. ఈ పాటలో కేరళకు చెందిన 60 మంది డ్యాన్సర్లు పాల్గొనడం విశేషం. మిక్కీ జే మేయర్ అందించిన ఈ ఫోక్ నెంబర్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. వేర్వేరు సామాజిక వర్గాల నుంచి వచ్చిన ఓ జంట అనుకోని పరిస్థితుల్లో చేసే ప్రయాణం, ఆ ప్రయాణంలో ఎదురయ్యే సంఘటనలతో సినిమా ఉత్కంఠభరితంగా సాగనుంది.



# 'సతీ లీలావతి'లో డైరెక్టర్‌గా కనిపిస్తా.. ఆ సినిమాతో పోల్చొద్దు : లావణ్య త్రిపాఠి

తెలుగు ప్రేక్షకులకు పెద్దగా ఇంట్రడక్షన్ అవసరం లేని భామ లావణ్య త్రిపాఠి ఈ బ్యూటీ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం సతీలీలావతి భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్ (శివ మనసులో శృతి) సినిమాలను తెరకెక్కించిన తాతినేని సత్య దర్శకత్వం ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రాన్ని మే 8న గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా చేసిన చిట్‌చాట్‌లో ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది లావణ్య త్రిపాఠి. సతీ లీలావతి సినిమాను ఇప్పటికే చూశా. చాలా బాగుంది. సినిమాపై నాకు చాలా నమ్మకముంది. ప్రేక్షకులు ఎలాంటి ఫలితాన్నిస్తారో చూడాలంది లావణ్య త్రిపాఠి. సినిమా షూటింగ్ టైంలో నేను ప్రెగ్నెంట్ అని తెలిసిందే. కానీ మా టీం ఇచ్చిన సపోర్ట్‌తో సులభంగా షూటింగ్ పూర్తి చేశాను. ప్రతీ రోజూ షూటింగ్ పూర్తయ్యాక ఆస్పత్రికి వెళ్లి చెకప్ చేసుకుంటూ ఉండేదాన్ని. షూట్‌లో చిన్న చిన్న గాయాలవడం సాధారణంగా జరిగేదే కదా. ఈ కథ విన్నప్పుడు వరుణ్‌కు చెప్పాను. అప్పుడు ప్రెగ్నెంట్ అని నాకు తెలియదు. ఎలాంటి లక్షణాలు కూడా లేవు. షూటింగ్ కూడా అంత సులభమేం కాదని నాకు అర్థమైంది. ఈ సినిమా కోసం బరువు కూడా తగ్గాను. కానీ నాకు ఈ శక్తి ఎక్కడినుంచి వచ్చిందో తెలియదు. ఇక నుంచి ప్రెగ్నెంట్ అని తెలిస్తే మాత్రం షూటింగ్స్‌కు బ్రేక్ ఇస్తానంటూ చెప్పుకొచ్చింది. సతీలీలావతిలో తాను డైరెక్టర్ రోల్‌లో కనిపిస్తానని.. సినిమా చాలా ఎంటర్‌టైనింగ్‌గా సాగుతుందని చెప్పింది లావణ్య త్రిపాఠి. సతీ లీలావతిలో చూపించినట్టుగా రిలేషన్స్ బయటిప్రపంచంలో ఉండవు. అలాంటి పరిస్థితి ఏ మహిళకు రాకూడదు. నేను ప్రెగ్నెంట్ కదా అని మూవీ స్క్రిప్ట్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. కానీ యాక్షణ్ సీక్వెన్స్‌లో మార్పులు చేశారు. తొలిసారి నేను యాక్షన్ సీక్వెన్స్ చేశాను. సినిమాలో కాలితో కొట్టే సీన్ ఒకటి చేసినప్పుడు ఇబ్బందిగా అనిపించిందని చెప్పుకొచ్చింది. ఇందులో సీనియర్ యాక్టర్ నరేశ్, వీటీవీ గణేశ్ అద్భుతమైన పాత్రలు పోషించారు. చాలా వినోదాత్మకంగా ఉంటుంది. ఈమూవీని కమల్ హాసన్ సతీ లీలావతితో పోల్చలేం కానీ ఎంటర్‌టైనింగ్‌గా సాగుతుంది. అదొక క్లాసికల్ మూవీ. దాంతో ఈ సినిమాను పోల్చకూడదంది. సతీలీలావతి చిత్రాన్ని దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ బ్యానర్లపై నాగమోహన్ బాబు ఎం, రాజేష్ టి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నాడు.



Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com